www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

విలేకరులు కావలెను

18సం॥ లుగా వెలుపడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల, మండలాల వారీగా విలేకరులు కావలెను..

★ ఆసక్తి గల అభ్యర్థులు సంప్రదించవలసిన నంబర్ ★

సెల్ నెంబర్: 9951494039

సంపుటి : 17 | సంచిక : 210 | బుధవారం 30.09.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-

## 5 తరాల వరకు ప్రధాని కాలేరు

- 2027 యూపీ ఎన్నికల ముందు ఎస్పీ-కాంగ్రెస్ మధ్య సీట్ల రగడ
- కనీసం 150 సీట్లు కోరుతున్న కాంగ్రెస్
- కాంగ్రెస్ డిమాండ్‌పై ఐపీ సింగ్ ఘాటు వ్యాఖ్యలు
- 403 స్థానాల్లో ఒంటరిగా పోటీ చేయాలని సవాల్
- 5 తరాల వరకు గాంధీ కుటుంబం నుంచి ప్రధాని కాలేరని వ్యాఖ్య..

03



## ఆర్మీ చీఫ్‌తో మంత్రి ఉత్తమ్ భేటీ..

**ఎస్ఎల్‌బీసీ, కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణకు పకడ్బందీ ప్రణాళిక**

- టన్నెల్ పనుల పర్యవేక్షణకు ఆర్మీ అధికారి
- బ్యారేజీల మరమ్మతులకు ఇద్దరు ఆర్మీ అధికారులు
- క్లిష్టమైన ప్రాజెక్టులకు సైనిక నైపుణ్యం
- పనుల వేగం, నాణ్యతపై ప్రభుత్వ ప్రత్యేక దృష్టి
- 2028 జూన్‌లోగా టన్నెల్ పూర్తి చేయాలని లక్ష్యం
- ఎస్ఎల్‌బీసీ పనుల్లో 35 కిలోమీటర్లు పూర్తి
- కాళేశ్వరం బ్యారేజీలపై పునరుద్ధరణ పనులు వేగవంతం

03



## కలెక్టర్ జాబ్ వదిలేసి రాజకీయాల్లోకి..

- 13 ఏళ్ల సర్వీసుకు గత నెలలో వీడ్కోలు
- యూపీ నుంచే రాజకీయ ప్రస్థానం ప్రారంభం
- ప్రజా సమస్యల పరిష్కారం కోసమే రాజకీయాల్లోకి

05



# సీడబ్ల్యూసీలో కాంగ్రెస్ 5 డిమాండ్లు..

## 'ఓట్‌బందీ'పై మోదీ సర్కార్‌ను టార్గెట్

**కాంగ్రెస్ 5 డిమాండ్లు..**

1. ఓటర్ల జాబితాలో జరిగే ప్రతి పెద్ద మార్పునకు సంబంధించిన పూర్తి డేటాను బహిర్గతం చేయాలి.
2. తొలగించిన ఓటర్లకు పూర్తి సమాచారం ఇచ్చి, అప్పీల్ చేసుకునే అవకాశం కల్పించాలి.
3. రాజకీయ పార్టీలకు ఓటర్ల జాబితా డేటాను సులభమైన ఫార్మాట్‌లో సకాలంలో అందించాలి.
4. తీవ్రమైన వ్యత్యాసాలు, లోపాలు ఉన్న చోట స్వతంత్ర విచారణ జరగాలి.
5. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన కీలక డేటాలో ఎటువంటి సమాచారమూ దాచకుండా పూర్తి పారదర్శకత ఉండాలి.






ఐదు రాష్ట్రాల ఎన్నికలపై కాంగ్రెస్ ఫోకస్

- ఓటర్ల జాబితాపై ఖర్గే తీవ్ర ఆరోపణలు
- ఎన్నికల సంఘం తీరుపై ఖర్గే ఫైర్
- ఓటు హక్కును కాపాడుకోవాలంటూ పిలుపు
- ఓటర్ల జాబితాలో పారదర్శకతకు కాంగ్రెస్ డిమాండ్
- ఐదు కీలక డిమాండ్లు తెరపైకి తెచ్చిన ఖర్గే
- తొలగించిన ఓటర్లకు అప్పీల్ అవకాశం ఇవ్వాలి
- ఎన్నికల డేటా బహిర్గతం చేయాలని డిమాండ్
- సీఈసీపై ఖర్గే తీవ్ర స్థాయిలో విమర్శలు
- రాజ్యాంగాన్ని కాపాడాలని కాంగ్రెస్ పిలుపు
- ఎన్నికల ప్రక్రియపై స్వతంత్ర విచారణకు డిమాండ్

03

**ఢిల్లీ :** దేశంలో మరోసారి బ్రిటిష్ పాలన నాటి పరిస్థితులు పునరావృతమవుతున్నాయని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన చారిత్రక బాధ్యత నేడు కాంగ్రెస్ పార్టీపై ఉందని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ధ్వజమెత్తారు. సెప్టెంబర్ 29న జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఆయన ప్రారంభోపన్యాసం చేస్తూ.. కేంద్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. దశాబ్దం క్రితం 'పెద్ద నోట్ల రద్దు'తో దేశ ఆర్థిక వ్యవస్థను నాశనం చేసిన మోదీ ప్రభుత్వం, ఇప్పుడు 'ఓట్-బందీ' కుట్రతో బలమైన ప్రజాస్వామ్యాన్ని...

## ఔషధాల ధరలపై సుప్రీంకోర్టు ఆగ్రహం

**మందులపై 16 శాతం మార్జిన్ సూచన**

- క్యాన్సర్ మందుల ధరలపై సుప్రీంకోర్టు ఫైర్
- మందుల ధరల దోపిడీపై సుప్రీం ఆగ్రహం
- కార్పొరేట్ ఆసుపత్రుల తీరుపై తీవ్ర వ్యాఖ్యలు
- రోగులపై భారీ భారం మోపుతున్నారంటూ ఆగ్రహం
- మందుల ధరల్లో భారీ వ్యత్యాసంపై నిలదీత
- ప్రభుత్వ పథకాలపై పడుతున్న భారం ఎంత?
- పన్ను చెల్లింపుదారుడిపైనే చివరికి భారం
- ఔషధ ధరల నియంత్రణపై సుప్రీం కీలక సూచనలు
- ఆసుపత్రి ఫార్మసీలపైనే కొనుగోలు ఎందుకంటూ ప్రశ్న

02

ఇది కేవలం దోపిడీ కాదు.. నరమేధం

రూ.2,700 మందుకు రూ.27 వేల ధరేంటి?





## కేటీఆర్‌కు కవిత వార్నింగ్

**నాతో పెట్టుకోకు.. ఆధారాలు బయటపెడతా**

- బీఆర్ఎస్ పతనానికి మీరే కారణమంటూ ఆరోపణలు
- గుంటనక్క మైండ్‌గేమ్‌లో పడొద్దంటూ హితవు
- కేటీఆర్ వ్యాఖ్యలకు కవిత ఘాటు కౌంటర్
- కేసీఆర్‌పై నిందలు వేయడమేంటని కవిత ప్రశ్న
- మీ వైఫల్యాలను కేసీఆర్‌పై నెట్టొద్దంటూ ఫైర్

05

## ఆ పోలీసులను గుర్తించండి

**అసెంబ్లీ దగ్గర మహిళా ఎమ్మెల్యేల ఘటనపై హైకోర్టు ఉత్తర్వులు..**

- పోలీసుల ప్రవర్తనపై డీజీపీకి హైకోర్టు ఆదేశం
- మహిళా ఎమ్మెల్యేలపై ఆరోపణలకు ఆధారాలు లేవు

02



## ఎర్రవల్లిలో అధికారుల సర్వే పూర్తి..

- భూముల లెక్కలు తేల్చేందుకు అధికారుల చర్యలు
- 388 ఎకరాల భూమిలో సర్వే పూర్తి
- 506 మంది అనుభవదారులకు అధికారుల నోటీసులు
- ప్రభుత్వ భూముల వివరాలపై అధికారుల పరిశీలన

02





## నాకు బాధగా లేదు..

**అనుచరుల జోలికొస్తే ఊరుకోం**

నాయకులు నోరు జారితే మహిళలతో కొట్టిస్తా!

- మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చూపుతాం
- వరంగల్ అభివృద్ధిపై బీజేపీకి సవాల్
- కేంద్ర నిధులు తెచ్చి మాట్లాడండి
- బీఆర్ఎస్ నేతలపై కొండా ఫైర్
- వరంగల్‌లో పురాతన ప్రాంతాలు అభివృద్ధి చేయాలి

05

## నిందలు వేయడం కాంగ్రెస్ నైజం

**దొంగ ఓట్ల ఏరివేతే లక్ష్యమన్న రాంచందర్‌రావు**

- కాంగ్రెస్ తీరుపై రాంచందర్‌రావు తీవ్ర ఫైర్
- ఈవీఎంలపై ఆరోపణలు చేయడం పరిపాటిగా మారింది
- ఓటమి తర్వాత ఎన్నికల సంఘంపై విమర్శలా?
- ఎన్నికల వ్యవస్థపై దుష్ప్రచారం చేస్తున్నారంటూ ఫైర్
- ఓటర్ల జాబితా సవరణపై బీజేపీ స్పష్టత

02



## కీపర్లేదే కీలక పాత్ర!

- ఆయుధాల చోరీలో భారీ నగదు లావాదేవీలు
- కీపర్లతో మల్లేశ్ కుమ్మక్కైనట్లు దర్యాప్తులో వెల్లడి
- మల్లేశ్‌తో కలిసి కీపర్లపై పోలీసుల విచారణ
- మద్రాస్ రెజిమెంట్‌లో సీన్ రీ-కన్‌స్ట్రక్షన్
- మల్లేశ్‌ను 10 రోజుల కస్టడీలో విచారణ

02



## సొంత నియోజకవర్గంలో ఇళ్ల కూల్చివేతలు

**పేదల బతుకులను రోడ్డున పడేస్తారా?**

**నోటీసులు ఇవ్వకుండానే ఇళ్ల కూల్చివేత**

**బుల్డోజర్ రాజ్ నడుపుతున్నారంటూ హరీశ్ ఫైర్**



- మద్దూరులో ఇళ్ల కూల్చివేతపై హరీశ్ ఫైర్
- పేదల ఇళ్ల కూల్చివేతపై హరీశ్ రావు ఆగ్రహం
- ఇదేనా మీ ప్రజా పాలన అంటూ నిలదీత
- కోర్టు తీర్పులను గౌరవించరా అంటూ ప్రశ్న
- పేదలకు న్యాయమైన పరిహారం ఇవ్వాలి
- భూసేకరణ చట్టం అమలు చేయాలని డిమాండ్
- బాధితులకు పునరావాసం కల్పించాలన్న హరీశ్

03

# ఆ పోలీసులను గుర్తించండి

### అసెంబ్లీ దగ్గర మహిళా ఎమ్మెల్యేల ఘటనపై హైకోర్టు ఉత్తర్వులు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ అసెంబ్లీ దగ్గర ఘటనపై హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. మహిళా ఎమ్మెల్యేల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన పోలీసులను గుర్తించాలని సూచించింది. ఈ మేరకు డీజీపీని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. పోలీసులపై చర్యలకు రిపోర్ట్‌ను స్పీకర్ ముందు ఉంచాలని డీజీపీకి ఆదేశాలు జారీ అయ్యాయి. స్పీకర్ ఆదేశం మేరకే పోలీసులు వ్యవహరించి ఉంటే.. అది స్పీకర్ అధికార పరిధిలోకి వస్తుందని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసు విచారణలో భాగంగా హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. మహిళా ఎమ్మెల్యేలు పోలీసులతో అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆధారాలు లేవని కోర్టు స్పష్టం చేసింది. గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు సవరించింది. అసెంబ్లీ నిబంధనలు ఉల్లంఘిస్తే.. స్పీకర్‌కు మాత్రమే చర్యలు తీసుకునే అధికారం ఉందని తెలిపింది. స్పీకర్ ఉత్తర్వులను మార్చేందుకు కారణాలు కనిపించడం లేదని పేర్కొంది. ఈ ఘటన అసెంబ్లీ బయట గానీ, గేటు దగ్గర గానీ జరిగి ఉంటే రిపోర్ట్‌ను కోర్టుకు సమర్పించాలని తెలిపింది. తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా వేసింది.

# ఐటీ టు ఆటో డ్రైవర్..

## హృదయాలను కదిలిస్తున్న యువతి కథ..!

**బెంగళూరు :** ఐటీ ఉద్యోగం ఉందంటే సమాజంలో ఒక మంచి హోదా, చేతినిండా డబ్బు ఉన్నట్లే అనుకుంటారు. కానీ, ఆ మెరిసే కార్పొరేట్ జీవితం వెనుక ఎవరి కష్టాలు వారికుంటాయి. బెంగళూరుకు చెందిన ఓ యువతి కథ సరిగ్గా ఇలాంటిదే. ఒకప్పుడు ప్రశాంతంగా ఏసీ గదుల్లో ఐటీ ఉద్యోగం చేసిన ఆమె, ఇప్పుడు బెంగళూరు వీధుల్లో ర్యాపిడో ఆటో నడుపుతోంది. ఎవరైనా ఆమెను ఆటో డ్రైవర్ సీటులో చూడగానే సాధారణంగా జీవనోపాధి కోసం కష్టపడుతున్న మరో మహిళ అనుకుంటారు. కానీ ఆమె వెనుక ఉన్న అసలు కథ విన్నారంటే ఎవరైనా ఆశ్చర్యపోవాల్సిందే. ఈ యువతికి చెందిన ఓ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో చెక్కర్లు కొడుతోంది. ఈ వీడియో ప్రకారం.. ఆ యువతి తండ్రి హఠాన్మరణం చెందడంతో ఆమె జీవితం ఒక్కసారిగా మారిపోయింది. ఇంట్లో తల్లిని ఒంటరిగా వదిలేసి నైట్ షిఫ్ట్‌లు చేయడం ఆమెకు చాలా కష్టంగా మారింది. తల్లికి తోడుగా ఉంటూ, ఇంటి బాధ్యతలు చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఇక నైట్‌షిఫ్ట్ ఉద్యోగాలు చేయడం కుదరదని గ్రహించి, ఆ ఐటీ కొలువుకు స్వస్తి చెప్పి పూర్తిగా కొత్త మార్గాన్ని ఎంచుకుంది. కార్పొరేట్ రంగంలో పనిచేసిన అనుభవం ఉన్నప్పటికీ, ఏమాత్రం సంకోచించకుండా ఆటో నడపాలని నిర్ణయించుకుంది. మొదట్లో ఈ నిర్ణయాన్ని ఆమె కుటుంబ సభ్యులు అస్సలు జీర్ణించుకోలేకపోయారు, బాగా వ్యతిరేకించారు కూడా. కానీ ఆమె మాత్రం వెనక్కి తగ్గకుండా తన దారిలోనే ముందుకు సాగింది. ఇటీవల తన్వి అనే కంటెంట్ క్రియేటర్ ఈ ఆటోలో ప్రయాణిస్తున్నప్పుడు ఈ ఆసక్తికరమైన విషయాన్ని తెలుసుకుంది. వారిద్దరి మధ్య జరిగిన సంభాషణ మెల్లగా కెరీర్, కుటుంబం, సమాజం మహిళలపై పెట్టే ఒత్తిళ్లపైకి వెళ్లింది. ఆమె ధారాళంగా ఇంగ్లీష్ మాట్లాడటం చూసి ఆశ్చర్యపోయిన తన్వి, "నువ్వు ఐటీలో చేశావా?" అని అడగ్గా, ఆమె నవ్వుతూ "అవును" అని సమాధానమిచ్చింది. ఈ కొత్త వృత్తి గురించి చెప్తూ.. "ఇది అనుకున్నంత చెడ్డదేమీ కాదు, పైగా ఐటీలో కంటే ఆటో నడపడం వల్లే ఎక్కువ సంపాదిస్తున్నా" అని చెప్పడం విశేషం. అన్నింటికన్నా ముఖ్యం.. సొంతంగా సమయాన్ని కేటాయించుకుంటూ, రాత్రిపూట తల్లికి తోడుగా ఉండటానికి ఈ పని ఎంతో ఉపయోగపడుతోందని సంతోషంగా పంచుకుంది. అయితే, ఈ ప్రయాణంలో ఆమెకు ఎన్నో రకాల అనుభవాలు ఎదురవుతుంటాయి. "అంత చక్కగా ఇంగ్లీష్ మాట్లాడుతూ ఆటో నడపడం ఏంటి?" అని చాలామంది ప్రయాణికులు ఆశ్చర్యంగా ప్రశ్నిస్తుంటారు. పురుషులదే పైచేయిగా ఉండే ఈ రంగంలో, సమాజంలో ఉన్న పాత ఆలోచనలను ఆమె నిత్యం ఎదుర్కొంటూనే ఉంది. ఈ సంభాషణను వీడియో తీసిన తన్వి.. జనాలు ఏమనుకుంటారు? అనే ఆలోచనను పక్కనపెట్టి తను అనుకున్నది సాధించిన ఈ మహిళా డ్రైవర్ ధైర్యాన్ని అభినందిస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో పోస్ట్ చేసింది. "ఆమె ఇతరుల మాటలను పట్టించుకోలేదు. స్వేచ్ఛను, స్వతంత్రతను, తన జీవితాన్ని తన చేతుల్లోకి తీసుకోవడాన్ని ఎంచుకుంది. ధైర్యంగా ఉండటం అంటే ఏదో అద్భుతాలు చేయడమే కాదు, 'నాకు ఇది కావాలి, నేను దీన్నే ఎంచుకుంటున్నాను' అని చెప్పగలగడమే అసలైన ధైర్యం" అని వీడియో పోస్ట్ చేస్తూ క్యాప్షన్‌లో రాసుకొచ్చింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతూ, ఏకంగా 3 లక్షలకు పైగా వ్యూస్ సాధించింది. చాలా మంది నెటిజన్లు పాజిటివ్ కామెంట్స్ చేస్తున్నారు.

# ఎర్రవల్లిలో అధికారుల సర్వే పూర్తి..

**సిద్దిపేట,ఫ్లాష్ ఇండియా :** గజ్వేల్ నియోజకవర్గంలోని మార్కుక్ మండలం ఎర్రవల్లి, కొండపాక మండలం వెలికట్ట గ్రామాల్లో భూములకు సంబంధించి అధికారుల సర్వే పూర్తైంది. ఎర్రవల్లిలోని సర్వే నంబర్ 325లో ఉన్న 388 ఎకరాలు, వెలికట్టలోని సర్వే నంబర్ 271లో అధికారులు సర్వే నిర్వహించారు. ఎర్రవల్లిలోని సర్వే నంబర్ 325లో 244 మంది అనుభవదారులకు, వెలికట్టలోని సర్వే నంబర్ 271లో ఉన్న 118 మంది అనుభవదారులకు అధికారులు నోటీసులు జారీ చేశారు. అనంతరం ఆయా భూముల్లో పొజిషన్ సర్వే నిర్వహించారు. ఎర్రవల్లి గ్రామంలో అధికారులు ఎనిమిది రోజుల పాటు సర్వే చేపట్టారు. అలాగే వెలికట్ట గ్రామంలో ఐదు రోజుల పాటు సర్వే కొనసాగింది. భూముల వివరాలు తదితర అంశాలను పరిశీలించిన అధికారులు సర్వేను పూర్తి చేశారు. ఈ సర్వేకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన నివేదికను సిద్దిపేట జిల్లా కలెక్టర్‌కు అధికారులు అందజేశారు. ఆ నివేదికను ప్రభుత్వానికి కలెక్టర్ అందజేయనున్నారు. కాగా.. ఇటీవల అసెంబ్లీ వేదికగా సిద్దిపేట జిల్లా మార్కుక్ మండల పరిధిలోని భూముల లెక్కలను తేల్చాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రంగంలోకి దిగిన రెవెన్యూ అధికారులు.. ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ భూముల్లో సర్వే చేపట్టారు. ఎర్రవల్లిలోని 325 సర్వే నంబర్‌లోని 388 ఎకరాల భూముల్లో సర్వే నిర్వహించారు. అలాగే వెలికట్ట గ్రామంలోనూ సర్వే చేశారు. భారీ బందోబస్తు నడుమ రెవెన్యూ అధికారులు ఈ ప్రక్రియను చేపట్టి... భూముల సర్వేను పూర్తి చేశారు.

# నిందలు వేయడం కాంగ్రెస్ నైజం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా అక్కడ ఓడిపోయిన తర్వాత.. ఆ ఓటమిని జీర్ణించుకోలేక ప్రతిసారీ ఈవీఎంలపై లేదంటే ఓటర్ల జాబితాల సవరణ పేరుతో కేంద్ర ఎన్నికల సంఘంపై అసత్యాలు ప్రచారం చేయడం కాంగ్రెస్, 'ఇండియా' కూటమికి పరిపాటిగా మారిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రపంచ దేశాలన్నీ భారతదేశ ప్రజాస్వామ్య ప్రక్రియను, ఎన్నికల నిర్వహణ వ్యవస్థను ఆదర్శంగా తీసుకుని ప్రశంసిస్తుంటే.. కాంగ్రెస్ పార్టీ మాత్రం పచ్చి అబద్ధాలతో అంతర్జాతీయ స్థాయిలో దేశ ప్రతిష్టను దిగజార్చే కుట్రలు చేస్తోందని ధ్వజమెత్తారు. గతంలో కేరళ రాష్ట్రంలో ఓటర్ల సవరణ ప్రక్రియ పారదర్శకంగా జరగడం వల్లే తాము విజయం సాధించామని స్వయంగా కాంగ్రెస్ పార్టీ నేతలే బహిరంగంగా చెప్పుకున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కేరళలో అనుకూలంగా ఉన్నప్పుడు స్వాగతించి, దేశవ్యాప్తంగా మాత్రం అదే ప్రక్రియపై తప్పుడు సంకేతాలు పంపడం కాంగ్రెస్ ద్వంద్వ నీతికి నిదర్శనమని విమర్శించారు. ఎన్నికల కమిషన్‌లో ఎలాంటి అంతర్గత విభేదాలు లేవని, వ్యవస్థను అస్థిరపరిచేందుకు విపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని రాంచందర్‌రావు స్పష్టం చేశారు. దొంగ ఓట్లను పకడ్బందీగా ఏరివేసి అత్యంత పారదర్శకమైన, విశ్వసనీయమైన ఓటర్ల జాబితాను రూపొందించడమే ఎన్నికల సంఘం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సవరణ ప్రక్రియలో అర్హులైన ఏ ఒక్క నిజమైన ఓటరు కూడా తన ఓటు హక్కును కోల్పోరని స్పష్టతనిచ్చారు. ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించినప్పుడల్లా బాధ్యతాయుతమైన రాజ్యాంగబద్ధ వ్యవస్థలపై నిందలు మోపుతూ వాటిని బద్నాం చేయడం మానుకోవాలని కాంగ్రెస్ నాయకత్వానికి రాంచందర్‌రావు హితవు పలికారు.



### భారతీయ జనతా పార్టీ చింతపల్లి మండల ఓబీసీ అధ్యక్షుడిగా

**నల్లగొండ జిల్లా / చింతపల్లి ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** భారతీయ జనతా పార్టీ చింతపల్లి మండల ఓబీసీ అధ్యక్షుడిగా తనను నియమించినందుకు ఇడబోయిన వెంకటయ్య యాదవ్ పార్టీ నాయకత్వానికి, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులకు, కార్యకర్తలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఓబీసీ వర్గాల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఓబీసీ సోదరులకు ఏ సమస్య వచ్చినా వారికి అండగా నిలిచి, పార్టీ సిద్ధాంతాలు, నియమ నిబంధనలకు అనుగుణంగా నిరంతరం పనిచేస్తానని పేర్కొన్నారు. దేశంలో వెనుకబడిన వర్గాల సంక్షేమం, సాధికారతకు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఇడబోయిన వెంకటయ్య యాదవ్ తెలిపారు. ఓబీసీ వర్గాలకు విద్య, ఉపాధి, స్వయం ఉపాధి, నైపుణ్యాభివృద్ధి వంటి రంగాల్లో అవకాశాలు కల్పించడంతో పాటు, రాజకీయ మరియు సామాజికంగా వెనుకబడిన వర్గాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందని అన్నారు. ఓబీసీ వర్గాలకు సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, ఆర్థిక అభివృద్ధి అందేలా కృషి చేయడం ప్రతి కార్యకర్త బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు, ఓబీసీల కోసం అందుబాటులో ఉన్న పథకాలను గ్రామ స్థాయిలో ప్రజలకు చేరవేయడానికి కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, ఓబీసీ సోదరులందరికీ ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, ఓబీసీ వర్గాల సంక్షేమానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని ఇడబోయిన వెంకటయ్య యాదవ్ స్పష్టం చేశారు.

# కీపర్లేదే కీలక పాత్ర!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** సికింద్రాబాద్ పరిధిలోని బొల్లారం మద్రాస్ ఆర్మీ రెజిమెంట్‌లో జరిగిన సంచలనాత్మక ఆయుధాల చోరీ కేసులో పోలీసుల దర్యాప్తు వేగవంతమైంది. ఈ కేసు విచారణలో కీలక పురోగతి లభించగా, ప్రధాన నిందితుడైన మాజీ హవల్దార్ మల్లేశ్‌కు ఆర్మీ ఆయుధాగారం (ఆర్మరీ) కీపర్లు పూర్తిస్థాయిలో సహకరించినట్లు పోలీసులు ఆధారాలతో సహా నిర్ధారించారు. ఈ నేరంలో భాగస్వామ్యమున్న ఆయుధాగారం కీపర్లు వినోద్, శేషులను పోలీసులు తక్షణమే అదుపులోకి తీసుకున్నారు.

**కీపర్లతో మల్లేశ్ కుమ్మక్కు.. రూ. లక్షల్లో ఆర్థిక లావాదేవీలు**

మిలిటరీ క్యాంపులోని ఆయుధాగారం నుంచి తుపాకులు, బుల్లెట్లను దొంగిలించే క్రమంలో మల్లేశ్‌తో కలిసి వినోద్, శేషులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించినట్లు పోలీసుల విచారణలో స్పష్టమైంది. ఈ చోరీకి సంబంధించి మాజీ హవల్దార్ మల్లేశ్ , ఈ ఇద్దరు కీపర్ల మధ్య భారీ మొత్తంలో ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు సాంకేతిక ఆధారాలను (టెక్నికల్ ఎవిడెన్స్) అధికారులు సేకరించారు. ఆయుధాలు చోరీ చేసి బయటకు తరలించినందుకు గానూ వారికి మల్లేశ్ భారీగా నగదు ముట్టజెప్పినట్లు భావిస్తున్నారు.

**10 రోజుల పోలీస్ కస్టడీ.. మద్రాస్ రెజిమెంట్‌లో సీన్ రీ-కన్‌స్ట్రక్షన్**

ఇప్పటికే మల్లేశ్ నివాసంలో సోదాలు నిర్వహించి, నిబంధనలకు విరుద్ధంగా దాచి ఉంచిన అనేక ఆర్మీ ఆయుధాలను, భారీగా బుల్లెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం 10 రోజుల పోలీస్ కస్టడీలో ఉన్న మల్లేశ్‌ను పోలీసులు తీవ్రంగా ప్రశ్నిస్తున్నారు. విచారణలో భాగంగా చోరీ ఎలా జరిగింది, ఆయుధాలను ఏ విధంగా బయటకు తెచ్చారనే అంశాలను ప్రత్యక్షంగా నిర్ధారించుకోవడానికి మల్లేశ్‌ను బొల్లారంలోని మద్రాస్ రెజిమెంట్‌కు తీసుకెళ్లి సీన్ రీ-కన్‌స్ట్రక్షన్ నిర్వహించారు. కేసు విచారణ పురోగతిలో ఉండటంతో ఈ ఆయుధాల చోరీకి సంబంధించిన మరిన్ని సంచలన వివరాలు త్వరలోనే వెలుగులోకి వచ్చే అవకాశముంది.

# సిమెంట్ ధరలకు రెక్కలు

**ఢిల్లీ :** దసరా, దీపావళి పండుగల సీజన్ సమీపిస్తున్న వేళ నిర్మాణ రంగానికి సిమెంట్ భారం మరింత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. అక్టోబర్ నెలలో దేశవ్యాప్తంగా వివిధ మార్కెట్లలో సిమెంట్ కంపెనీలు మరో విడత బస్తాకు రూ. 5 నుండి రూ. 20 వరకు ధరలను పెంచేందుకు ప్రయత్నిస్తున్నాయని ప్రముఖ ఆర్థిక పరిశోధనా సంస్థ సెంట్రమ్ బ్రోకింగ్ తన తాజా నివేదికలో వెల్లడించింది. జూలై, ఆగస్టు నెలల్లో దాదాపు స్థిరంగా ఉన్న సిమెంట్ ధరలు, సెప్టెంబర్‌లో నెలవారీగా బస్తాకు రూ. 7 పెరిగి రూ. 356కి చేరింది. దక్షిణాదిన అత్యధికంగా బస్తాకు రూ. 11 పెరగ్గా, ఇతర ప్రాంతాల్లో రూ. 5-9 మధ్య పెరిగాయి. అయితే, సెప్టెంబర్ నెల చివరి నాటికి సేల్స్ టార్గెట్ చేరుకునేందుకు డీలర్లు పాత ధరలకే స్టాక్ విక్రయించడంతో ఈ పెంపు ప్రభావం వినియోగదారులకు పూర్తిగా చేరలేదు. రాబోయే రోజుల్లో కంపెనీల బిల్లింగ్ రేట్లు పూర్తిస్థాయిలో అమలయ్యే అవకాశం ఉంది. అక్టోబర్‌లో కంపెనీలు ప్రతిపాదించిన ఈ కొత్త ధరల పెంపు డీలర్ల నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని నివేదిక స్పష్టం చేసింది. నిర్మాణ పనుల వేగం, డిమాండ్, పెరిగిన ధరలను అమలు చేయడానికి డీలర్లు ఎంతవరకు సిద్ధంగా ఉన్నారనే దాన్ని బట్టి ఉంటుందని పేర్కొంది.

# ఔషధాల ధరలపై సుప్రీంకోర్టు ఆగ్రహం

**ఢిల్లీ :** దేశంలో కార్పొరేట్ ఆసుపత్రులు, ఫార్మా రంగం అనుసరిస్తున్న దోపిడీ విధానాలపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల మందులపై ఏకంగా పది రెట్లు అధిక ధరలు వసూలు చేయడంపై సర్వోన్నత ధర్మాసనం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. 'ఇది కేవలం దోపిడీ కాదు.. స్పష్టమైన నరమేధం' అంటూ తీవ్రమైన వ్యాఖ్యలు చేసింది. న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్ నాథ్ , జస్టిస్ సందీప్ మెహతా లతో కూడిన ధర్మాసనం దేశంలో ఔషధాల ధరలపై దాఖలైన పిటిషన్‌పై ఇవాళ విచారణ చేపట్టింది.

**రూ.2,700 మందు.. రూ.27,000 ఎమ్మార్పీ**

ఓ క్యాన్సర్ మందు రిటైలర్లకు కేవలం రూ. 2,700కే సరఫరా అవుతుంటే, అదే మందును ఆసుపత్రులు, ఫార్మసీలు ఏకంగా రూ. 27 వేల ఎంఆర్‌పీ వేసి రోగులపై పెను భారం మోపుతున్నాయని సుప్రీంకోర్టు తప్పుబట్టింది. రిటైలర్ ధరకూ, తుది వినియోగదారుడికి విక్రయించే ధరకూ ఇంత భారీ వ్యత్యాసం ఉండటం ఏంటని ధర్మాసనం ప్రశ్నించింది. ఇక కార్పొరేట్ ఆసుపత్రులు ఎవరినీ వదిలిపెట్టడం లేదని.. కనీసం వ్యక్తి చనిపోయినా డెడ్‌బాడీని కూడా బయటకు వెళ్లనీయని పరిస్థితిని సృష్టిస్తున్నాయని పేర్కొన్నది. ఫార్మా రంగం కూడా ఈ తీవ్రమైన అంశాన్ని పట్టించుకోవడం లేదు మండిపడింది. ఆసుపత్రులు తమ సొంత ఫార్మసీల నుంచే మందులు కొనాలని రోగులను బలవంతం చేయడంపై కూడా కోర్టు ఆరా తీసింది.

**ప్రభుత్వ పథకాలు.. ప్రజాధనం దుర్వినియోగం**

ప్రభుత్వ ఆరోగ్య పథకాల కింద చికిత్స పొందే రోగులకు ఇలా అధిక ధరలకు మందులు విక్రయించడం ద్వారా చివరికి ప్రభుత్వ ఖజానాపై, పన్ను చెల్లించే సామాన్య ప్రజలపై భారం పడుతోందని సుప్రీం కోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వ పథకంలో రోగి చికిత్స పొందితే.. ఆ బిల్లు ఎవరు రీయింబర్స్ చేస్తారు? పన్ను చెల్లింపుదారుడే కదా! మరి అలాంటప్పుడు దీనిపై ఎందుకు నియంత్రణ ఉండకూడదు?' అని ధర్మాసనం ప్రశ్నించింది.

**అన్ని మందులకు ఒకే రకమైన 16 శాతం మార్జిన్**

అన్ని రకాల మందులపై ఏకరీతిగా 16 శాతం మార్జిన్ ఉండేలా తగిన విధానాన్ని రూపొందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు కోరింది. ఔషధ ధరల నియంత్రణ ఉత్తర్వులు ముసాయిదా, 2013 ప్రకారం.. జనరల్ ప్రిస్క్రిప్షన్లు, వైద్య పరికరాల నియంత్రణకు సంబంధించిన పిటిషన్లపై విచారణ సందర్భంగా కోర్టు ఈ కీలక సూచనలు చేసింది. కేంద్రం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ అంశంపై దృష్టి సారించి తగిన సమతుల్యతను తీసుకువస్తామని కోర్టుకు విన్నవించారు.

## చిన్నారిని ఆశీర్వదించిన దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ నాయక్



**నల్లగొండ జిల్లా/ చింతపల్లి, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మాల్ పట్టణంలోని JP మహల్ పంక్షన్ హాల్ లో జరిగిన మహీరా పుట్టినరోజు వేడుకల్లో దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ , బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ బీల్యా నాయక్ పాల్గొని చిన్నారి మహీరాను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా చిన్నారి మహీరాకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన రమావత్ రవీంద్ర కుమార్, కేతావత్ బీల్యా నాయక్ చిన్నారి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉడత అక్రమ్ యాదవ్, మాజీ సర్పంచ్ జ్యోతి చందర్ నాయక్, వైస్ ఎంపిపి అరేకంటి రాములు, పడకంటి రాజు గౌడ్, ముద్దం జోగయ్య, జైపాల్ నాయక్, మోగుతాల దుర్గయ్య, అంజయ్య, శ్రీనివాస్ రెడ్డి, ఈరటి మల్లేష్, సుమన్ నాయక్, బాస్కర్ నాయక్, గడ్డం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.





ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి 7730032999 flashindiadaily@gmail.com

# ఆర్మీ చీఫ్‌తో మంత్రి ఉత్తమ్ భేటీ..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** శ్రీశైలం ఎడమ కాలువ టన్నెల్ నిర్మాణం, అలాగే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులను మరింత వేగవంతం చేసి, పకడ్బందీగా అమలు చేయడానికి తెలంగాణ ప్రభుత్వం భారత సైన్యానికి చెందిన ఇంజినీరింగ్ విభాగం నుంచి అదనపు అధికారుల సేవలను వినియోగించుకోనుంది. న్యూఢిల్లీలోని రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన ఇంటిగ్రేటెడ్ హెడ్ క్వార్టర్స్ (మిలిటరీ సెక్రటరీ బ్రాంచ్) ఈ డిప్యూటేషన్ కోసం లెఫ్టినెంట్ కర్నల్ సత్యదేవ్ సింగ్, లెఫ్టినెంట్ కర్నల్ రంజిత్ మీనన్, లెఫ్టినెంట్ కర్నల్ భల్లా పేర్లను తెలంగాణ ప్రభుత్వ పరిశీలనకు పంపింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ ముగ్గురు అధికారులను డిప్యూటిషన్‌పై తీసుకుని, అత్యంత క్లిష్టమైన సాగునీటి ప్రాజెక్టుల పనులకు కేటాయించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

**ఆర్మీ చీఫ్‌తో మంత్రి ఉత్తమ్ భేటీ..**

తెలంగాణ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇటీవల న్యూఢిల్లీలో ఆర్మీ చీఫ్ (కోఆఫ్) జనరల్ ధీరజ్ సేత్‌ను ఆయన అధికారిక నివాసంలో కలిసి, రాష్ట్రానికి అనుభవజ్ఞులైన ఆర్మీ ఇంజినీర్లను డిప్యూటేషన్‌పై పంపాల్సిందిగా వ్యక్తిగతంగా అభ్యర్థించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ నిర్మాణంలోని సాంకేతిక సవాళ్లు, ప్రాముఖ్యతతో పాటు మూడు కాళేశ్వరం బ్యారేజీల మరమ్మతులు, పునరుద్ధరణ పనుల గురించి ఆయనకు వివరించారు. ఈ సమావేశం జరిగిన వెంటనే ప్రతిపాదనలు వేగంగా ముందుకు సాగాయి. ఆర్మీ హెడ్ క్వార్టర్స్ స్పందించి ముగ్గురు అధికారుల పేర్లను రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆర్మీ చీఫ్ జనరల్ ధీరజ్ సేత్ ఇద్దరూ పూణేలోని ఖడక్‌వాస్లాలోని ప్రతిష్టాత్మక నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్డీఏ) పూర్వ విద్యార్థులే కావడం గమనార్హం. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎయిర్ ఫోర్స్ విభాగంలో శిక్షణ పొందే భారత వాయుసేనలో ఫైటర్ పైలట్‌గా సేవలు అందించగా, జనరల్ సేత్ ఆర్మీ విభాగంలో శిక్షణ పొంది ఆర్మర్డ్ కార్ప్స్‌కు ఎంపికయ్యారు.

**సైనిక అధికారుల సేవలు అమూల్యం..**

'మాజీ సైనికాధికారిగా సాయుధ దళాల నిబద్ధత, క్రమశిక్షణ, నైపుణ్యం, సమస్యలను పరిష్కరించే తీరుపై నాకు ఎంతో గౌరవం ఉంది. క్లిష్టమైన ప్రాజెక్టులు, విపత్తు సమయాలు, కఠినమైన వాతావరణంలో ఎలా పనిచేయాలో సైనిక అధికారులకు ప్రత్యేక శిక్షణ ఉంటుంది. వారిలో సాంకేతిక పరిజ్ఞానంతో పాటు నాయకత్వ లక్షణాలు, జవాబుదారీతనం ఉంటాయి' అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గత రెండేళ్లుగా తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్న కర్నల్ పరీక్షిత్ మెహ్రా అనుభవం ఈ నిర్ణయం వెనుక కీలకమని అధికారులు తెలిపారు. ఎస్ఎల్బీసీ టన్నెల్, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ ప్రణాళికలతో కర్నల్ మెహ్రా నిత్యం మమేకమై ఉన్నారు. క్షేత్రస్థాయిలో ఆయన అందిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం, సమన్వయం ఇరిగేషన్ శాఖకు ఎంతో ప్రయోజనకరంగా మారాయి.

**పనుల వివరాలు..**

సుమారు 44 కిలోమీటర్ల మేర సాగే ఈ టన్నెల్‌లో ఇప్పటికీ 35 కిలోమీటర్ల తవ్వకం పూర్తయింది. మిగతా పనులను పూర్తి చేయడానికి ప్రభుత్వం.. 2028 జూన్‌ను గడువుగా నిర్దేశించింది. టన్నెల్ తవ్వకాలను పర్యవేక్షించడానికి ఒక ఆర్మీ అధికారిని నియమించనున్నారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) సిఫారసుల మేరకు నేల, కాంక్రీట్, ఫౌండేషన్ పరీక్షలు తుది దశకు చేరాయి. ఐఐటీ బాంబే, ఏఎఫ్ఆర్వై ఇండియా సంస్థలు వీటిని పరిశీలిస్తూ తుది డిజైన్లను సిద్ధం చేస్తున్నాయి. మిగతా ఇద్దరు ఆర్మీ అధికారులను ఈ బ్యారేజీల పునరుద్ధరణ పనులకు కేటాయించనున్నారు. శ్రామికుల భద్రతకు, ఇంజినీరింగ్ ప్రమాణాలకు ఎక్కడా భంగం కలగకుండా ఈ పనులన్నింటినీ నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. ఆర్మీ ఇంజినీర్ల భాగస్వామ్యం వల్ల ప్రాజెక్టుల్లో నాణ్యతా నియంత్రణ మెరుగుపడుతుందని, వేగవంతమైన నిర్ణయాలు తీసుకోవడానికి ఆస్కారం ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## సొంత నియోజకవర్గంలో ఇళ్ల కూల్చివేతలు



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని మద్దూరులో రాత్రికి రాత్రే పేదల ఇళ్లను కూల్చివేయడంపై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కొడంగల్ బిడ్డను అంటూ కొడంగల్ ప్రజల ఇళ్లనే కూల్చేస్తావా రేవంత్ రెడ్డి అని ప్రశ్నించారు. రాత్రికి రాత్రే పేదల ఇళ్లపైకి బుల్డోజర్లను నడిపించే హక్కు నీకు ఎవరు ఇచ్చారు? కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా ఇంత కర్కశంగా ఎందుకు వ్యవహరిస్తున్నారు? న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పులను కూడా గౌరవించరా? అని నిలదీశారు.

**ఇదేనా మీ ప్రజా పాలన?:**

ఒక్కసారిగా ఇండ్లు కూల్చితే, ఏండ్ల నుండి నివాసం ఉన్నవారు ఒక్కసారిగా ఎక్కడికి వెళ్తారని ప్రశ్నించారు. అధికారం ఉందని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తారా? పోలీసులను అడ్డుపెట్టుకుని బుల్డోజర్ రాజ్ అమలు చేస్తారా? అని మండిపడ్డారు. పేదల బతుకులను రోడ్డున పడేయడమేనా మీ ప్రజా పాలన? యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిందని గొప్పగా చెప్పుకునే భూసేకరణ చట్టం-2013 ప్రకారం బాధితులకు తక్షణం న్యాయమైన పరిహారం, పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు.

# సీడబ్ల్యూసీలో కాంగ్రెస్ 5 డిమాండ్లు..

**న్యూఢిల్లీ :** దేశంలో మరోసారి బ్రిటిష్ పాలన నాటి పరిస్థితులు పునరావృతమవుతున్నాయని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన చారిత్రక బాధ్యత నేడు కాంగ్రెస్ పార్టీపై ఉందని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ధ్వజమెత్తారు. సెప్టెంబర్ 29న జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఆయన ప్రారంభోపన్యాసం చేస్తూ.. కేంద్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. దశాబ్దం క్రితం 'పెద్ద నోట్ల రద్దు'తో దేశ ఆర్థిక వ్యవస్థను నాశనం చేసిన మోదీ ప్రభుత్వం, ఇప్పుడు 'ఓట్-బందీ' కుట్రతో బలమైన ప్రజాస్వామ్యాన్ని అంతం చేస్తోందని తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపుపై తీవ్ర ఆందోళన బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు తూట్లు పొడుస్తూ.. బీజేపీ, మోదీ ప్రభుత్వపు కనుసన్నల్లో అధికారులు ఇష్టానుసారంగా ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగిస్తున్నారని ఖర్గే ఆరోపించారు. రక్షించాల్సిన ఎన్నికల సంఘమే భక్షకుడిగా మారిందని, ప్రధాన ఎన్నికల కమిషనర్ ప్రభుత్వానికి కీలుబొమ్మలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. తోటి అధికారుల విశ్వాసమే చూరగొనలేని సీఈసీపై దేశం ఎలా నమ్మకం ఉంచగలదని ప్రశ్నించారు. యువత నిలదీసి ప్రశ్నిస్తుందనే భయంతోనే మోదీ ప్రభుత్వం నిశ్శబ్దంగా 'ఫారం-6' నిబంధనల్లో అక్రమ మార్పులు చేసి, యువతను ఓటు హక్కుకు దూరం చేస్తోందని మండిపడ్డారు. ఈ హక్కు ఎవరి భిక్ష కాదని, లక్షలాది మంది ప్రాణత్యాగాల ఫలితమని గుర్తుచేశారు. రాహుల్ గాంధీ లేవనెత్తిన అంశాలపై సమర్థన మహదేవపుర, ఆలంద్ అలాగే హర్యానా, మహారాష్ట్ర ఎన్నికలకు సంబంధించి రాహుల్ గాంధీ లేవనెత్తిన ఆధారాలు, గణాంకాలు అక్షరాలా నిజమని తేలిపోయాయని ఖర్గే అన్నారు. నకిలీ ఓటర్లు, అనుమానాస్పద చిరునామాలు, ఒకే అడ్రస్‌పై భారీ సంఖ్యలో ఓట్లు నమోదు కావడంపై రాహుల్ లేవనెత్తిన ప్రశ్నలపై ఎన్నికల సంఘం కనీస స్పందన కూడా చూపలేదని దుయ్యబట్టారు.

**కాంగ్రెస్ పార్టీ ఐదు ప్రధాన డిమాండ్లు:**

దేశంలో ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా ఉండేందుకు కాంగ్రెస్ పార్టీ తరఫున ఖర్గే ఐదు కీలక డిమాండ్లను తెరపైకి తెచ్చారు

1. ఓటర్ల జాబితాలో జరిగే ప్రతి పెద్ద మార్పునకు సంబంధించిన పూర్తి డేటాను బహిర్గతం చేయాలి.
2. తొలగించిన ఓటర్లకు పూర్తి సమాచారం ఇచ్చి, అప్పీల్ చేసుకునే అవకాశం కల్పించాలి.
3. రాజకీయ పార్టీలకు ఓటర్ల జాబితా డేటాను సులభమైన ఫార్మాట్‌లో సకాలంలో అందించాలి.
4. తీవ్రమైన వ్యత్యాసాలు, లోపాలు ఉన్న చోట స్వతంత్ర విచారణ జరగాలి.
5. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన కీలక డేటాలో ఎటువంటి సమాచారమూ దాచకుండా పూర్తి పారదర్శకత ఉండాలి.

**ప్రభుత్వ నైతికతపై నిలదీత**

ఎన్నికల కమిషన్‌లోని ఇద్దరు కమిషనర్లే సీఈసీ ఏకపక్ష వైఖరిని తప్పుబట్టారని, అధికార పార్టీకి లబ్ధి చేకూర్చేందుకే వారు ప్రయత్నిస్తున్నారని దేశం గ్రహించిందని ఖర్గే అన్నారు. ఇకనైనా ఆ పదవుల్లో కొనసాగే నైతిక హక్కు వారికి లేదని, వారిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. వారి వెనుక ఉండి నడిపించిన ప్రధానమంత్రి నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే ఐదు రాష్ట్రాల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరి ఓటును, హక్కును కాపాడుకోవాలని, రోడ్డు నుంచి పార్లమెంటు వరకు ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడాలని ఆయన సీడబ్ల్యూసీ వేదికగా పిలుపునిచ్చారు.

# ప్రజాస్వామ్యాన్ని నవ్వులపాలు చేస్తున్నారు



**న్యూఢిల్లీ :** 'మేమే ఓట్లని ట్యాంపరింగ్ చేస్తే మాకు 400 ఎంపీ సీట్లు వచ్చేవి.. కానీ 240 సీట్లకు మాత్రమే బీజేపీ పరిమితం అయ్యింది' అని ఆ పార్టీ ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఈరోజు(మంగళవారం) మీడియాతో మాట్లాడుతూ.. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని చూసి జనం ఛీ కొడుతున్నారని వ్యాఖ్యానించారు. భారత ప్రజాస్వామ్యాన్ని నవ్వులపాలు చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలో 'సర్' అనేది కొత్తది కాదని తెలిపారు. ఈవీఎంలను తీసుకొచ్చిందే రాజీవ్ గాంధీ అని గుర్తుచేశారు. వీవీ ప్యాట్‌లను తీసుకువచ్చింది మోదీ ప్రభుత్వమని ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు.

**గెలవలేక సమస్యలు సృష్టిస్తున్నారు: ఎంపీ ధర్మపురి**

కాంగ్రెస్ ముక్త్ భారత్.. రాహుల్ గాంధీతోనే సాధ్యమని బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ వ్యాఖ్యానించారు. పౌరసత్వానికి ముందే సోనియా గాంధీకి ఓటు ఎలా వచ్చిందో రాహుల్ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈసీని వాడుకొని వారికి పదవులు ఇచ్చిందే కాంగ్రెస్ అంటూ దుయ్యబట్టారు. ఎన్నికల్లో గెలవలేక లేనిపోని సమస్యలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. దేశాన్ని, హిందువులను కించపరచడమే లక్ష్యంగా రాహుల్ పని చేస్తున్నారని విమర్శించారు. రాహుల్‌ను ప్రతిపక్ష పదవి నుంచి తొలగించాలని ధర్మపురి అరవింద్ డిమాండ్ చేశారు.

# ఎర్రవెల్లిలో కలిపి అన్యాయం చేశారు..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** సిద్దిపేట జిల్లా గజ్వేలు నియోజకవర్గంలోని మార్కూక్ మండలం శివారు వెంకటాపూర్ గ్రామ రైతులకు న్యాయం చేస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. ధరణి పోర్టల్‌లో రికార్డుల మార్పులతో తమ తాత ముత్తాతల నుంచి సాగు చేసుకుంటున్న భూములపై హక్కులు కోల్పోయామని, రైతులు మంత్రికి విన్నవించిన నేపథ్యంలో ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెలికితీసి అర్హులైన వారికి న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో శివారు వెంకటాపూర్ గ్రామానికి చెందిన తుమ్మల సత్యనారాయణ, శేరి పోషయ్య, శేరి శ్రీకాంత్, పుట్ట విఠల్, పుట్ట దయానంద్, బచ్చలి జహంగీర్ తదితరులు మంత్రి పొంగులేటిని కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. శివారు వెంకటాపూర్ గ్రామంలోని సర్వే నంబర్లు 38, 41, 47, 85, 88, 100లోని దాదాపు 134 ఎకరాల వ్యవసాయ భూముల్లో తమ తాత ముత్తాతల కాలం నుంచి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఐతే ధరణి పోర్టల్ వచ్చిన తర్వాత రికార్డులను తారుమారు చేయడం ద్వారా తమ భూములపై హక్కులు లేకుండా చేశారని, తమ పొలాలు తమకు కాకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధరణి అమలుకు ముందు తమ వద్ద ఉన్న పాస్‌బుక్కులు, గ్రామ నక్షా పతాలను కూడా రైతులు మంత్రికి చూపించారు. ఆనాటి ప్రభుత్వంలో అధికారులు కొత్త పాస్‌బుక్కులు ఇస్తామని చెప్పి తమ వద్ద ఉన్న పాత పాస్ బుక్కులను తీసుకున్నారని, ఐతే కొత్త పాస్‌బుక్కులు ఇవ్వకుండా తమను మోసం చేశారని వారు మంత్రికి వివరించారు. ఆనాటి ప్రభుత్వ హయాంలో ఓవర్ మ్యాపింగ్ పేరుతో శివారు వెంకటాపూర్ గ్రామ వ్యవసాయ భూములను ఎర్రవెల్లి గ్రామంలోని సర్వే నంబర్ 325లో కలిపి నక్షా రూపొందించారని, దీనివల్ల తమకు తీవ్ర అన్యాయం జరిగిందని రైతులు ఆరోపించారు.

**వారి భూమికి అప్పగించేలా..**

ప్రస్తుతం ఎర్రవెల్లిలోని సర్వే నంబర్ 325లో ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వే తరహాలోనే శివారు వెంకటాపూర్ గ్రామంలోనూ సమగ్ర సర్వే నిర్వహించి, గ్రామ సరిహద్దులను స్పష్టంగా గుర్తించాలని బాధితులు అన్నారు. రికార్డులు, పాత పాస్‌బుక్కులు, గ్రామ నక్ష, క్షేత్ర స్థాయి పరిస్థితులను పరిశీలించి ఎవరికి చెందిన భూమి వారికి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని వారు మంత్రిని కోరారు. రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన శివారు వెంకటాపూర్ గ్రామ రైతులకు ఇప్పటివరకు ఎలాంటి పరిహారం అందలేదని మంత్రికి వివరించారు. దేవాసుకుంట, ముత్తిలింగం కుంటలను కూడా పాండురంగా రిజర్వాయర్‌లో విలీనం చేశారని తెలిపారు. రిజర్వాయర్ నిర్మాణం, భూముల మ్యాపింగ్, రికార్డుల మార్పుల కారణంగా తమ గ్రామ రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

**వాస్తవాలను వెలుగులోకి తెస్తాం..**

రైతుల సమస్యలను విని, ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి వాస్తవాలను నిర్ధారిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. అర్హులైన ఏ ఒక్కరికీ అన్యాయం జరగనివ్వం. ఎవరి భూమి వారికి దక్కేలా చట్టపరమైన అన్ని చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. సమావేశంలో రెవెన్యూ సెక్రటరీ డీఎస్ లోకేష్ కుమార్, సర్వే అండ్ ల్యాండ్ సెటిల్‌మెంట్స్ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# 5 తరాల వరకు ప్రధాని కాలేరు

**ఢిల్లీ :** వచ్చే ఏడాది మొదల్లో ఉత్తర్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు జరగబోతునున్నాయి. ఈ నేపథ్యంలో పార్టీలు ప్రచార పర్వాన్ని ఇప్పుడే ప్రారంభించాయి. ఇదిలా ఉంటే, సీట్ల పంపకాల్లో మాత్రం సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ), కాంగ్రెస్ పార్టీ మధ్య తీవ్ర విభేదాలు ఏర్పడింది. 150 పైగా సీట్లు కావాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ఎస్పీ నేత ఐపీ సింగ్ తీవ్రంగా విమర్శించారు. "లూటియన్స్ కాంగ్రెస్ వాళ్లు యూపీలో మొత్తం 403 స్థానాల్లో పోటీ చేస్తారు. రాబోయే 5 తరాల వరకు ఏ గాంధీ అని పిలువబడే వ్యక్తి ప్రధానమంత్రి కాలేరు. 1989 నుంచి గాంధీ కుటుంబం ప్రధాని పదవిని చేపట్టలేదు. రాబోయే అనేక దశాబ్దాల్లో కూడా ఇదే జరుగుతుంది" అని తీవ్ర స్థాయితో ఐపీ సింగ్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నేతలు ఢిల్లీలో కూర్చుని పగటి కలలు కంటున్నారని వెక్కిరించారు. కాంగ్రెస్ వ్యూహాకర్తలను టార్గెట్ చేస్తూ... యూపీలో కాంగ్రెస్‌కు అంత బలం ఉంటే 403 స్థానాల్లో ఒంటరిగా పోటీ చేసి తన బలాన్ని ఎందుకు పరీక్షించుకోకూడదు.? అని ప్రశ్నించారు. పొత్తులు, రాజకీ పరిణామాలనే ఊతకర్రలతో ప్రజల్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు ఇంకెంత కాలం సాగుతాయి? రాహుల్ గాంధీ రాజకీయాల్లోకి ప్రవేశించి రెండున్నర దశాబ్దాలు గడిచాయని, తరాలు మారాయి, కానీ కాంగ్రెస్ ఇప్పటికీ అవే ప్రశ్నల్ని ఎదుర్కొంటోందని ఘాటుగా స్పందించారు. కాంగ్రెస్ సాధించింది ఏంటని ప్రశ్నించారు. కేవలం కెమెరాలు, వేదికలు, పెద్ద పెద్ద ప్రకటనలు మాత్రమే రాజకీయ పునాదిని నిర్మించలేదని హితవు చెప్పారు. క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తల బలం, ఓటర్లతో నిరంతర సంబంధం రాజకీయ సంస్థకు అసలైన బలమని అన్నారు. ఉత్తర్ ప్రదేశ్ ఎన్నికల్లో కాంగ్రెస్, ఎస్పీ కలిసి పోటీ చేయాలని భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో 403 స్థానాల్లో 150 స్థానాలు మాకు దక్కాలని కాంగ్రెస్ కోరుకుంటోంది. 100కు సీట్ల సంఖ్య తగ్గకూడదనే నిర్ణయంపై ఆ పార్టీ ఉంది. ఇక ఎస్పీ 80 సీట్లు ఇవ్వాలని భావిస్తోంది. దీంతో రెండు పార్టీల మధ్య విభేదాలు కనిపిస్తున్నాయి.



# ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

**పెద్దపల్లి, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ప్రజలకు ప్రభుత్వ సేవలు సత్వరంగా, సమర్థవంతంగా అందించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని వివిధ కార్యాలయాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, కార్యాలయాల నిర్వహణ, ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులు, ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ఫైళ్లు, రికార్డులను క్రమపద్ధతిలో నిర్వహించాలని, కార్యాలయాలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. ప్రజలకు అవసరమైన సమాచారం, సేవలు సులభంగా అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని, ప్రజల సమస్యలను నిబంధనల మేరకు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో కలెక్టరేట్ ఏవో బండి ప్రకాష్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సరంపేటలో 33/11 కేవీ సబ్‌స్టేషన్

**మర్రిగూడ,ఫ్లాష్ ఇండియా :** మండలంలోని సరంపేట గ్రామంలో రూ.2.15 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి మంగళవారం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు. సబ్‌స్టేషన్ నిర్మాణంతో సరంపేటతో పాటు పరిసర గ్రామాల్లో విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం విద్యుత్ సరఫరాలో ఎదురవుతున్న అంతరాయాలు, తక్కువ వోల్టేజీ సమస్యలు తగ్గడంతో పాటు వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ సరఫరా కూడా మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా రైతులకు సాగునీటి మోటార్లు సక్రమంగా పనిచేసేందుకు ఈ సబ్‌స్టేషన్ ఉపయోగపడనుంది. గ్రామీణ ప్రాంతాల్లో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సబ్‌స్టేషన్‌ను నిర్మిస్తున్నట్లు నాయకులు తెలిపారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడి విద్యసాగర్ రెడ్డి, ఏఈ సందీప్ నాంపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెన్నమనేని రవీందర్రావు, మర్రిగూడ మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాందాస్ శ్రీనివాస్ తో పాటు విద్యుత్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# క్రీడలతో విద్యార్థుల్లో ప్రతిభకు పదును



**పెద్దపల్లి ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రెండు రోజులుగా కొనసాగిన పెద్దపల్లి జిల్లా ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు మంగళవారం ఉత్సాహభరిత వాతావరణంలో ముగిశాయి. సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ సహకారంతో నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ విభాగాల్లో పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతోపాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. క్రీడల ద్వారా శారీరక దారుఢ్యంతోపాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు అలవడతాయని పేర్కొన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కనుకుంట్ల లక్ష్మణ్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లోని క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో వివిధ స్థాయిల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులు తదుపరి పోటీల్లో మరింత మెరుగైన ప్రదర్శనతో సత్తా చాటాలని సూచించారు. కార్యక్రమంలో సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, నోడల్ ఆఫీసర్ శోభారాణి, జోనల్ కన్వీనర్ దాసరి రమేష్, మండల కన్వీనర్ ప్రణయ్‌తో పాటు సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు, పీఈటీలు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# సంపాదకీయం



# మరణమృదంగమేనా ?

ప్రపంచ వాతావరణ వ్యవస్థపై ఎల్‌నినో...తీవ్రంగా ప్రభావం చూపుతోంది. ఇటీవలి దశాబ్దాల్లో మరింత శక్తిమంతంగా మారుతున్నట్లు శాస్త్రవేత్తలు తేల్చారు. సెప్టెంబరు నుంచి ఫిబ్రవరి మధ్య లక్షల మంది జనం ప్రాణాలు కోల్పోతారని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. సరైన వర్షాలు లేకపోవడంతో...పంటలు ఆశించిన స్థాయిలో పండవని తేల్చారు. ఇదే ఇవాళ్టి స్టోరీ బోర్డు. ప్రపంచవ్యాప్తంగా అత్యంత వేడి ఉండే రోజులు 44 శాతం పెరిగితే...పరిస్థితులు ఏలా ఉంటాయి ? వానకాలంలో ఎండలు మండిపోవడానికి కారణాలు ఏంటి ? వచ్చే ఆరు నెలల్లో వేల మంది ప్రాణాలు కోల్పోతారా ? భారత్‌లోనూ మరణమృదంగం కొనసాగుతుందా ? ప్రభుత్వాలు అప్రమత్తంగా వ్యవహరించకపోతే...మృతుల సంఖ్య మరింత పెరుగుతుందా ?ఎల్‌నినో ముప్పు ముంచుకొస్తోంది. వరణుడు వచ్చినట్లే వచ్చి...తెరమరుగయ్యాడు. ఆశించిన స్థాయిలో వర్షాలు లేక...సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయి. ఉష్ణోగ్రతలు...వేసవిని తలపిస్తున్నాయి. ప్రాజెక్టుల్లో ఆశించిన స్థాయిలో నీళ్లు లేవు. ఇంతలోనే శాస్త్రవేత్తలు బాంబు పేల్చారు. ఈ ఏడాది బలంగా మారిన సూపర్ ఎల్‌నినోపై తాజా నివేదిక అదే భయాన్ని కలిగిస్తోంది. ఎల్‌నినో ప్రభావంతో వచ్చే కొన్ని నెలల్లో ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన ఎండలు పెరగొచ్చని క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్ అంచనా వేసింది. దీంతో వేడి తట్టుకోలేక లక్షలాది మంది ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని తెలిపింది. ఈ ఏడాది జూన్ నుంచి 2027 ఫిబ్రవరి వరకు సూపర్ ఎల్‌నినో ప్రభావంతో...ప్రపంచవ్యాప్తంగా 4.51 లక్షల మంది వేడి కారణంగా చనిపోయే అవకాశం ఉందని ఈ నివేదిక వెల్లడించింది. అయితే ఇది కచ్చితమైన సంఖ్య కాదని, వాతావరణ పరిస్థితులు మారితే ఆ సంఖ్య కూడా మారొచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. 2026 సెప్టెంబర్ నుంచి 2027 ఫిబ్రవరి వరకు...అంటే అరు నెలల పాటు వాతావరణంలో ఊహించని మార్పులు చోటు చేసుకోనున్నాయి. ఈ ఆరు నెలల్లో వేడి వల్ల ప్రపంచవ్యాప్తంగా సుమారు 2.39 లక్షల మంది మరణించే అవకాశం ఉందని క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్ నివేదిక అంచనా వేసింది. ఎల్‌నినో ప్రభావం వచ్చే ఏడాది వేసవి వరకు కొనసాగితే ఆ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని హెచ్చరించింది.సాధారణ సంవత్సరాలతో పోలిస్తే...ప్రపంచవ్యాప్తంగా అత్యంత వేడి ఉండే రోజులు 44 శాతం పెరగొచ్చని తెలిపింది. అంటే ఎండలు ఎక్కువ రోజులు మాత్రమే కాకుండా, మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరించారు. సూపర్ ఎల్‌నినో...భారత్‌పై తీవ్రంగా ప్రభావం చూపుతుందని శాస్త్రవేత్తలు వార్నింగ్ ఇస్తున్నారు. మరణమృదంగం కొనసాగుతుందని...అప్రమత్తంగా వ్యవహరించాలని ప్రభుత్వాలకు సూచిస్తున్నారు. సెప్టెంబర్ నుంచి ఫిబ్రవరి వరకు దేశంలో సుమారు 15,800 మరణాలు సంభవించే అవకాశం ఉందని నివేదిక అంచనా వేసింది. ఇందులో డిసెంబర్ నుంచి ఫిబ్రవరి మధ్యే సుమారు 7,400 మంది వేడి కారణంగా ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని స్పష్టం చేసింది. అయితే భారత్‌లో అసలు ఎండాకాలం మార్చి తర్వాత మొదలవుతుంది. ఆ సమయంలో కూడా ఎల్‌నినో ప్రభావం కొనసాగితే వేడి వల్ల మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని పరిశోధకులు చెబుతున్నారు.వేడి కారణంగా ఎక్కువ మరణాలు సంభవించే అవకాశం ఉన్న దేశాల్లో నైజీరియా మొదటి స్థానంలో ఉంది. ఆ తర్వాత ఇండోనేసియా, సూడాన్, భారత్, బ్రెజిల్ ఉన్నాయి. నైజీరియాలో 31,400 మంది, ఇండోనేసియాలో 19,300 మందికిపైగా, సూడాన్‌లో 17,500 వరకు, భారత్‌లో దాదాపు 16 వేల మంది వరకు, బ్రెజిల్‌లో 13,300 వరకు ప్రాణాలు కోల్పోతారని శాస్త్రవేత్తలు హెచ్చరించారు. ఆఫ్రికాలోని కొన్ని దేశాల్లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉండొచ్చని నివేదిక తెలిపింది. నైజీరియా, సూడాన్, నైజర్, చాద్ ప్రాంతాల్లో కలిపి సుమారు 66,800 అదనపు మరణాలు సంభవించే అవకాశం ఉందని అంచనా వేసింది. ఎండలు మరింత పెరిగితే...మరణాలు అదే స్థాయిలో పెరుగుతాయని అంటున్నారు.వేడి పెరిగే ప్రాంతాల్లో ముందుగానే జాగ్రత్తలు తీసుకుంటే చాలా మంది ప్రాణాలను కాపాడొచ్చని క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్ తెలిపింది. ప్రజలకు ముందుగానే ఎండలపై హెచ్చరికలు ఇవ్వడం, చల్లగా ఉండే కేంద్రాలను ఏర్పాటు చేయడం, తాగునీరు అందుబాటులో ఉంచడం వంటి చర్యలు ఉపయోగపడతాయని తెలిపింది. ముఖ్యంగా వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు, చిన్నపిల్లలు, ఎండలో పనిచేసే కార్మికులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించింది. వేడి ఎక్కువగా ఉండే రోజుల్లో ఆసుపత్రుల్లో అదనపు సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని, ప్రస్తుత పరిశోధకులు భవిష్యత్తులో ఎదురయ్యే వాతావరణానికి ఒక ముందస్తు హెచ్చరికగా చెప్పింది. ఎండలు మరింత తీవ్రంగా మారే పరిస్థితుల్లో ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకోవడం వల్ల భారీ ప్రాణనష్టాన్ని తగ్గించే అవకాశం ఉందని నివేదిక స్పష్టం చేసింది.వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు ఈ ఎఫెక్ట్ ఉంటుందని అంతర్జాతీయ సంస్థలు చెబుతున్నాయి. ఐతే అక్కడితోనే పరిస్థితులన్నీ సాధారణ స్థితికి రాకపోవచ్చు. ఆ ప్రభావం వచ్చే ఏడాది చివరి వరకు ఉండే అవకాశాలు లేకపోలేవు అనేది పలువురి వాతావరణ నిపుణుల అభిప్రాయం. ఈ నేపథ్యంలో దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చే విద్యుత్ రంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలని చెబుతున్నారు. పవర్ డిమాండ్‌కి తగ్గట్టుగా ఉత్పత్తి, సరఫరా చేసేలా ప్రత్యేక ప్రణాళికలతో ముందుకెళ్లాలని సూచిస్తున్నారు. ప్రజలు కూడా ఈ విపత్కర పరిస్థితులు దృష్టిలో ఉంచుకుని విద్యుత్ వృథాని తగ్గించుకోవాలని సూచిస్తున్నారు. వరదలు వచ్చే అవకాశాలను ముందుగానే గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయడం, తాగునీటి నిల్వలు, ఆహార భద్రత, విద్యుత్ బ్యాకప్ వంటి అంశాలపై ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. దీర్ఘకాలిక వేడి, తేమ కారణంగా దోమలు పెరిగి వ్యాధులు విస్తరించే ప్రమాదం కూడా ఉందని హెచ్చరించారు.కాంక్రీట్ భవనాలు, డాంబర్ రహదారులు పగటిపూట వేడిని పీల్చుకుని రాత్రి విడుదల చేయడం వల్ల నగరాలు అర్బన్ హీట్ ఐలాండ్‌లుగా మారుతున్నాయి. దీనికి పరిష్కారంగా నగరాల్లో పెద్ద ఎత్తున అర్బన్ ఫారెస్టులు అభివృద్ధి చేయాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. మియావాకీ పద్ధతిలో వేగంగా పెరిగే చెట్లను నాటడం ద్వారా నగర ఉష్ణోగ్రతలను 3 నుంచి 4 డిగ్రీల వరకు తగ్గించే అవకాశం ఉందన్నారు. రోడ్ల పక్కన ఏర్పాటు చేసిన కాంక్రీట్ షోల్డర్లు, పేవర్లను తొలగించి వర్షపు నీరు భూమిలోకి చొచ్చుకుపోయేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ఎదురయ్యే ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను బలోపేతం చేయాలని సూచిస్తున్నారు. గ్రామస్థాయిలో సౌరశక్తితో నడిచే ఎయిర్ కండిషనింగ్ కమ్యూనిటీ హాళ్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అధిక ఉష్ణోగ్రతలు, తేమ కారణంగా కార్మికులు, పేద ప్రజలు విశ్రాంతి తీసుకునేందుకు ఇవి ఉపయోగపడతాయని అంటున్నారు.

# పరిష్కారం ఎక్కడ?

తెలంగాణలో భూముల సమస్య అనగానే రైతుల కళ్ల ముందు కనిపించేది ఒకే దృశ్యం.. చేతిలో పట్టా ఉంది.. రిజిస్ట్రేషన్ పత్రాలు ఉన్నాయి.. ఏళ్ల తరబడి భూమిని సాగు చేస్తున్నారు.. అయినా ఆ భూమి రికార్డుల్లో 22ఏ నిషేధిత జాబితాలో ఉందని తెలిస్తే పరిస్థితి ఒక్కసారిగా మారిపోతుంది. భూమి మనదే అని ఆధారాలు ఉన్నా అమ్ముకోలేని పరిస్థితి.. అవసరానికి బ్యాంకు రుణం తీసుకోలేని పరిస్థితి.. కుటుంబ అవసరాల కోసం భూమిని విక్రయించాలన్నా రిజిస్ట్రేషన్ ఆగిపోయే పరిస్థితి.. చివరకు తమ భూమి సమస్యను పరిష్కరించుకోవడానికి ఒక కార్యాలయం నుంచి మరో కార్యాలయానికి తిరగాల్సిన పరిస్థితి. ఇలాంటి సమస్య ఒక్క రైతుకే ఎదురైతే అది వ్యక్తిగత ఇబ్బంది. కానీ వేలాది మంది రైతులు ఇదే సమస్యను ఎదుర్కొంటుంటే అది ప్రభుత్వ పాలనకు సంబంధించిన ప్రశ్న. ఇప్పుడు తెలంగాణలో 22ఏ సమస్య కూడా అలాంటి దశలోనే ఉందన్న చర్చ బలంగా వినిపిస్తోంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ సమస్య తీవ్రతను గుర్తించి అసెంబ్లీ వేదికగా పరిష్కార మార్గాలను ప్రకటించడం ఈ అంశంపై ఆశలు పెంచింది. ముఖ్యంగా 22ఏకు సంబంధించిన వివిధ సమస్యలకు సంబంధించి 12 అంశాలపై మార్గదర్శకాలు రూపొందించాలని అధికారులను ఆదేశించడం కీలక పరిణామం. ఐఏఎస్ అధికారులతో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసి నిబంధనలను రూపొందించే ప్రక్రియ ప్రారంభించినట్లు ప్రభుత్వం చెబుతోంది. మరి ప్రశ్న ఏమిటంటే.. ముఖ్యమంత్రి స్థాయిలో సమస్యను గుర్తించి పరిష్కారం దిశగా అడుగులు వేస్తుంటే, ఆ పరిష్కారం క్షేత్రస్థాయికి ఎందుకు వేగంగా చేరడం లేదు? రైతుల సమస్యను పరిష్కరించడానికి గైడ్‌లైన్స్ రూపొందించడంలో ఇంత ఆలస్యం ఎందుకు? ఇదే ఇప్పుడు ప్రజల్లో వినిపిస్తున్న ప్రధాన ప్రశ్న. ఇక్కడ అసలు అంశం అధికార వికేంద్రీకరణ. ఒక రైతు భూమి 22ఏ జాబితాలో పొరపాటున చేరిందనుకుందాం. దాన్ని తొలగించడానికి అతడు తప్పనిసరిగా జిల్లా స్థాయి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిందేనా? ప్రతి చిన్న సమస్య కూడా కలెక్టర్ స్థాయికి వెళ్లాల్సిందేనా? ఒక రెవెన్యూ సమస్యకు పరిష్కారం తహసీల్దార్, ఆర్డీవో స్థాయిలోనే సాధ్యమైతే అక్కడే ఎందుకు పరిష్కరించకూడదు? రైతు ఒక చిన్న తప్పిదాన్ని సరిచేసుకోవడానికి జిల్లా కేంద్రానికి రావాల్సి వస్తే.. అతని సమయం, డబ్బు, శ్రమ ఎవరు భరిస్తారు? పరిపాలన ప్రజల దగ్గరకు వెళ్లాలా? లేక ప్రజలే పరిపాలన కోసం కార్యాలయాల చుట్టూ తిరగాలా? అనే ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన సమయం ఇది. భూ భారతి చట్టం ఉద్దేశం కూడా ఇదే దిశగా ఉందని చర్చ జరుగుతోంది. కింది స్థాయి అధికారులకు అధికారాలు ఇవ్వడం, ఆ నిర్ణయంపై అప్పీల్‌కు అదనపు కలెక్టర్ లేదా కలెక్టర్ స్థాయిని, రివిజన్‌కు ఉన్నతస్థాయిని ఉంచడం ద్వారా ఒక వ్యవస్థను ఏర్పాటు చేయాలన్న ఆలోచన కనిపిస్తుంది. అంటే ప్రతి ఫైల్ చివరకు ఉన్నతాధికారి టేబుల్ మీదకు వెళ్లే విధానం కాకుండా.. నిర్ణయం తీసుకునే బాధ్యతను కింది స్థాయికి ఇచ్చి, తప్పు జరిగితే పైస్థాయిలో అప్పీల్, రివిజన్ ద్వారా సరిదిద్దే విధానం ఉండాలి. ఇదే నిజమైన వికేంద్రీకరణ.అయితే ప్రస్తుతం 22ఏ మార్గదర్శకాల విషయంలో అధికార వికేంద్రీకరణపై స్పష్టత రావాల్సి ఉంది. కింది స్థాయి అధికారులకు అధికారాలు ఇస్తే అవినీతి పెరుగుతుందన్న భయం కొందరు అధికారుల్లో ఉందనే చర్చ వినిపిస్తోంది. కానీ ఇక్కడ ఒక విషయాన్ని మనం మర్చిపోకూడదు. అధికారాన్ని కిందికి ఇవ్వడం వల్ల అవినీతి పెరుగుతుందా? లేక అధికారాన్ని కొద్దిమంది ఉన్నతాధికారుల వద్ద కేంద్రీకరించడం వల్ల సమస్యలు పెరుగుతున్నాయా? అనేది వ్యవస్థ ఎలా పనిచేస్తుందనే దానిపై ఆధారపడి ఉంటుంది. అధికారాన్ని కిందికి ఇచ్చి, నిర్ణయ ప్రక్రియకు స్పష్టమైన నిబంధనలు పెట్టి, ప్రతి నిర్ణయాన్ని రికార్డు చేయించి, అప్పీల్ వ్యవస్థను బలంగా ఉంచితే బాధ్యత కూడా స్పష్టమవుతుంది. అందుకే పరిష్కారం అధికారాలను కేంద్రీకరించడం కాదు.. బాధ్యతను స్పష్టంగా నిర్వచించడం.ఇక ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న కొన్ని విధానాలను కూడా తెలంగాణలో పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అక్కడ 22ఏ జాబితా సవరణలకు సంబంధించి తహసీల్దార్, ఆర్డీవో స్థాయిలోనే కొన్ని నిర్ణయాలకు అవకాశం కల్పించడం, పైస్థాయిలో అప్పీల్, రివిజన్ వ్యవస్థను ఉంచడం వంటి విధానాలు చర్చకు వచ్చాయి. నోటీసులు ఇవ్వడం, సంబంధిత వ్యక్తుల వాదనలు వినడం, ఆధారాలను పరిశీలించడం, కారణాలతో కూడిన స్పీకింగ్ ఆర్డర్ ఇవ్వడం వంటి ప్రక్రియలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. అంటే ఎవరి భూమినైనా ఒక్క ఫైల్ ఆధారంగా నిషేధిత జాబితాలో పెట్టడం లేదా తొలగించడం కాకుండా.. సంబంధిత వ్యక్తికి తన వాదన వినిపించే అవకాశం ఇవ్వడం, అందుబాటులో ఉన్న రికార్డులను పరిశీలించడం, నిర్ణయానికి కారణాలను నమోదు చేయడం వంటి ప్రక్రియకు ప్రాధాన్యం ఇస్తున్నారన్నమాట.మన తెలంగాణలో కూడా ఇదే ప్రశ్న రావాలి. ఒక రైతు భూమి 22ఏ జాబితాలో ఎందుకు చేరింది? దానికి ఆధారం ఏమిటి? ఆ భూమి నిజంగా ప్రభుత్వ భూమేనా? అసైన్డ్ భూమేనా? ఎండోమెంట్ భూమా? వక్ఫ్ భూమా? లేక రికార్డుల్లో జరిగిన పొరపాటా? అనే విషయాన్ని స్పష్టంగా నిర్ధారించకుండా నిషేధిత జాబితాలో పెట్టడం ఎంతవరకు సమంజసం? ఒక సర్వే నంబర్‌లో కొంత భూమి మాత్రమే నిషేధానికి సంబంధించినదైతే మొత్తం సర్వే నంబర్‌ను నిషేధిత జాబితాలో పెట్టడం వల్ల ఎవరు నష్టపోతారు? చివరకు రైతే కదా.ఇక దశాబ్దాలుగా పట్టా భూమిగా ఉన్న భూముల పరిస్థితి మరింత కీలకం. 40, 50, 60 సంవత్సరాలుగా ఒక కుటుంబం భూమిని పట్టాగా అనుభవిస్తుంటే.. ఒక్కసారిగా పాత రికార్డులో ఉన్న ఏదో ఒక క్లాసిఫికేషన్ ఆధారంగా ఆ భూమిని ప్రభుత్వ భూమిగా పరిగణించడం సరైనదేనా? చరిత్రాత్మక రికార్డులు ముఖ్యమే. కానీ ప్రస్తుత రికార్డులు, పట్టాలు, రిజిస్ట్రేషన్ పత్రాలు, అనుభవ హక్కులు, ఇతర ఆధారాలను కూడా సమగ్రంగా పరిశీలించాల్సిందే. భూ రికార్డు అనేది ఒకే పాత పత్రంతో ముగిసిపోయే విషయం కాదు. కాలక్రమంలో వచ్చిన అన్ని మార్పులను పరిగణనలోకి తీసుకున్నప్పుడే న్యాయం జరుగుతుంది.ఇంకో ముఖ్యమైన అంశం సేల్ డీడ్స్. ఒక భూమి గతంలో చట్టబద్ధంగా విక్రయించబడింది. రిజిస్ట్రేషన్ జరిగింది. ఆ తర్వాత అదే భూమి 22ఏ జాబితాలోకి వెళ్లింది. ఇప్పుడు ఆ భూమిని కొనుగోలు చేయడానికి ఎవరైనా ముందుకు వస్తారా? పత్రాలు ఉన్నా రేపు మళ్లీ సమస్య వస్తుందేమోననే భయం ఉంటే మార్కెట్‌లో ఆ భూమి విలువ ఏంటి? అందుకే 22ఏ సమస్య కేవలం రెవెన్యూ రికార్డు సమస్య కాదు.. అది భూమి మార్కెట్, రైతు ఆస్తి విలువ, బ్యాంకు రుణాలు, కుటుంబ ఆర్థిక భద్రతతో ముడిపడిన సమస్య.అందుకే నిషేధిత జాబితాలో పొరపాటున చేరిన పట్టా భూములను సుమోటోగా పరిశీలించి తొలగించే విధానం కూడా అవసరం. అయితే సుమోటో తొలగింపు అంటే ఎలాంటి పరిశీలన లేకుండా తొలగించడం కాదు. స్పష్టమైన ప్రమాణాలు ఉండాలి. ఆధారాలు పరిశీలించాలి. సంబంధిత వ్యక్తులకు నోటీసులు అవసరమైన సందర్భాల్లో ఇవ్వాలి. థర్డ్ పార్టీ హక్కులు ఉంటే వారి వాదన వినాలి. నిర్ణయం తీసుకున్న అధికారి దానికి కారణాలను రికార్డులో నమోదు చేయాలి. ఇలా చేస్తే రైతుకు న్యాయం జరుగుతుంది.. ప్రభుత్వ భూముల రక్షణ కూడా జరుగుతుంది.ప్రస్తుతం మరో సమస్య దరఖాస్తు చేసుకునే మార్గం. ఒక రైతు తన భూమి తప్పుగా 22ఏలో ఉందని భావిస్తే ఎక్కడ దరఖాస్తు చేయాలి? ఏ పత్రాలు సమర్పించాలి? ఎంత కాలంలో పరిష్కారం అవుతుంది? ఎవరు విచారణ చేస్తారు? నిర్ణయంపై అప్పీల్ ఎవరికి? ఆ అప్పీల్‌కు గడువు ఎంత? రివిజన్ ఎక్కడ? ఈ ప్రశ్నలకు సాధారణ రైతుకు స్పష్టమైన సమాధానం ఉండాలి. ప్రభుత్వం విడుదల చేసే మార్గదర్శకాలు కేవలం అధికారుల కోసం కాకుండా ప్రజలకు అర్థమయ్యే భాషలో కూడా అందుబాటులో ఉండాలి.ఎందుకంటే 22ఏ జాబితా అనేది కేవలం ఒక ప్రభుత్వ ఫైల్ కాదు. దాని వెనుక ఒక కుటుంబం ఉంటుంది. ఒక రైతు జీవితకాల సంపాదన ఉంటుంది. ఒక ఇంటి భవిష్యత్తు ఉంటుంది. ఒక కుమార్తె వివాహం కోసం అమ్ముకోవాల్సిన భూమి ఉండొచ్చు. ఒక కుమారుడి చదువుకు రుణం తీసుకోవాల్సిన అవసరం ఉండొచ్చు. అనారోగ్యానికి చికిత్స చేయించుకోవడానికి ఆస్తిని ఉపయోగించాల్సిన పరిస్థితి ఉండొచ్చు. అలాంటి సమయంలో భూమి రికార్డులో ఒక నిషేధం పడితే అది రైతు జీవితంపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది.అందుకే ప్రభుత్వం చేయాల్సింది ఒక్కటే.. సమస్యను కాగితాల మీద కాకుండా రైతు కోణంలో చూడాలి. ముఖ్యమంత్రి అసెంబ్లీలో ప్రకటించిన పరిష్కార మార్గాలు కార్యాచరణలోకి రావాలి. తహసీల్దార్, ఆర్డీవో స్థాయిలో పరిష్కరించగల సమస్యలను అక్కడే పరిష్కరించే విధానం రావాలి. అప్పీల్‌కు అదనపు కలెక్టర్ లేదా కలెక్టర్ స్థాయి ఉండాలి. రివిజన్‌కు ఉన్నతస్థాయి ఉండాలి. ప్రతి నిర్ణయానికి బాధ్యత వహించే అధికారి ఎవరో స్పష్టంగా ఉండాలి. గడువులు ఉండాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే అవకాశం ఉండాలి. దరఖాస్తు స్థితిని రైతు తన మొబైల్ నుంచే తెలుసుకునే అవకాశం ఉండాలి.ఇక అధికారులు కూడా ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. అధికార వికేంద్రీకరణ అంటే అధికారాన్ని తగ్గించడం కాదు.. బాధ్యతను విస్తరించడం. ప్రతి చిన్న ఫైల్‌ను పైస్థాయికి పంపడం వల్ల వ్యవస్థ సురక్షితంగా కనిపించవచ్చు. కానీ ప్రజలకు మాత్రం అది మరింత భారంగా మారుతుంది. నిర్ణయం తీసుకునే అధికారాన్ని కిందికి ఇస్తే దానికి తోడు పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలి. డిజిటల్ రికార్డులు, ఆడిట్, అప్పీల్, రివిజన్, బాధ్యత నిర్ధారణ వంటి అంశాలను బలంగా ఉంచాలి. అప్పుడు అవినీతి భయంతో అధికారాలను కేంద్రీకరించాల్సిన అవసరం ఉండదు.చివరగా ఒక మాట.. 22ఏ సమస్యను ఇకపై కేవలం రెవెన్యూ శాఖ ఫైల్‌గా చూడకూడదు. ఇది రైతుల ఆస్తి హక్కులకు, భూమి లావాదేవీలకు, ప్రభుత్వ భూముల రక్షణకు, పరిపాలనా పారదర్శకతకు సంబంధించిన అంశం. ముఖ్యమంత్రి స్థాయిలో సమస్యను గుర్తించిన తర్వాత కూడా మార్గదర్శకాలు ఆలస్యమైతే దాని ప్రభావం మళ్లీ రైతుపైనే పడుతుంది. ప్రభుత్వం త్వరగా స్పష్టమైన, సులభమైన, పారదర్శకమైన నిబంధనలు తీసుకురావాలి. ఎవరి భూమి నిజంగా నిషేధిత కేటగిరీలో ఉండాలో అది ఆధారాలతో తేలాలి. తప్పుగా చేర్చిన భూములకు వేగంగా పరిష్కారం లభించాలి. ప్రతి రైతుకు దరఖాస్తు, విచారణ, అప్పీల్, రివిజన్ మార్గాలు స్పష్టంగా కనిపించాలి. 22ఏ జాబితా భూమిని రక్షించడానికి ఉండాలి కానీ భూమి యజమానిని శిక్షించడానికి మారకూడదు. ప్రభుత్వం ప్రజల దగ్గరకు వెళ్లే పరిపాలనను నిర్మించాలంటే ఇదే సరైన సమయం. ఎందుకంటే భూమి విషయంలో ఆలస్యం అంటే కేవలం ఒక ఫైల్ ఆలస్యం కాదు.. ఒక కుటుంబం భవిష్యత్తు ఆలస్యం. 22ఏ సమస్యకు పరిష్కారం ఎంత త్వరగా వస్తే అంత త్వరగా రైతుల్లో నమ్మకం పెరుగుతుంది.

# అంతర్గత సమన్వయానికి పరీక్ష

తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూకుడు పెంచడం కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని పెంచుతోంది. అసెంబ్లీ వేదికగా బీఆర్ఎస్ నేతలను లక్ష్యంగా చేసుకుని సీఎం చేస్తున్న రాజకీయ విమర్శలు, సవాళ్లు పార్టీ క్యాడర్‌కు ఊపునిస్తున్నప్పటికీ.. వాటిని క్షేత్రస్థాయిలో రాజకీయ బలంగా మార్చడంలో కాంగ్రెస్ ఎదుర్కొంటున్న అంతర్గత సమస్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారుతున్నాయి. ముఖ్యంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పార్టీ నేతల మధ్య సమన్వయం, స్థానిక నాయకత్వం, నిర్ణయాధికారం వంటి అంశాలు కాంగ్రెస్‌కు సవాలుగా కనిపిస్తున్నాయి.కరీంనగర్ నియోజకవర్గంలో పార్టీకి అధికారికంగా ఇన్‌చార్జి వ్యవస్థ ఉన్నప్పటికీ.. ఆ ఇన్‌చార్జులకు పూర్తి స్థాయి నిర్ణయాధికారం ఉందా? పార్టీ కార్యక్రమాలు వారి ఆధ్వర్యంలోనే సాగుతున్నాయా? లేక ఇతర నేతల ప్రభావం కొనసాగుతోందా? అనే ప్రశ్నలు కార్యకర్తల్లో చర్చకు వస్తున్నాయి. బాధ్యత ఒకరి వద్ద ఉండి, నిర్ణయం మరోచోట తీసుకుంటే పార్టీ కేడర్‌లో అయోమయం ఏర్పడే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీ కోసం పనిచేసిన పాత కార్యకర్తలకు తగిన గుర్తింపు, పదవులు, రాజకీయ ప్రాధాన్యం దక్కడం లేదనే అసంతృప్తి ఉంటే అది సంస్థాగతంగా పార్టీని బలహీనపరిచే అంశంగా మారవచ్చు.కరీంనగర్ రాజకీయంగా కాంగ్రెస్‌కు అత్యంత కీలకమైన ప్రాంతం. మరోవైపు సిరిసిల్లలో కూడా బీఆర్ఎస్‌కు బలమైన



రాజకీయ ప్రాతినిధ్యం ఉంది. అందువల్ల ఈ రెండు ప్రాంతాల్లో కాంగ్రెస్‌కు కేవలం ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారం సరిపోదు. ప్రత్యర్థి పార్టీ రాజకీయ ప్రచారాన్ని ఎదుర్కొనేందుకు బలమైన స్థానిక పార్టీ నిర్మాణం అవసరం. ఇక్కడే ముఖ్యమంత్రి వ్యూహానికి అసలు పరీక్ష ఎదురవుతోంది.మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కరీంనగర్ ప్రాంతంతో ఆయనకు ఉన్న రాజకీయ అనుబంధం నేపథ్యంలో స్థానిక పార్టీ వ్యవహారాల్లో ఆయన పాత్రపై కూడా చర్చ జరుగుతోంది. అయితే పార్టీ అంతర్గత నిర్ణయాలపై అధికారిక స్పష్టత లేకుండా వ్యక్తుల పాత్రకు సంబంధించి తుది నిర్ణయాలకు రావడం సరికాదు. కరీంనగర్‌లో వెలిచాల రాజేందర్ రావు, సిరిసిల్లలో కేకే మహేందర్ రెడ్డికి పార్టీ బాధ్యతలు అప్పగించిన నేపథ్యంలో వారికి స్పష్టమైన అధికార పరిధి ఉంటేనే సంస్థాగత వ్యవస్థ సమర్థంగా పనిచేసే అవకాశం ఉంటుంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీఆర్ఎస్‌పై రాష్ట్రస్థాయిలో చేస్తున్న రాజకీయ పోరాటం కరీంనగర్ వంటి కీలక ప్రాంతాల్లో ఫలప్రదం కావాలంటే స్థానిక నేతల మధ్య సమన్వయం తప్పనిసరి. ఎవరు ఇన్‌చార్జి? ఎవరు నిర్ణయం తీసుకుంటారు? కార్యకర్తలను ఎవరు సమన్వయం చేస్తారు? పార్టీ కార్యక్రమాలకు నాయకత్వం ఎవరు వహిస్తారు? అనే అంశాల్లో స్పష్టత రావాలి. లేకపోతే అసెంబ్లీలో సీఎం విసిరే రాజకీయ సవాళ్లు క్షేత్రస్థాయిలో అదే స్థాయిలో ప్రతిఫలించకపోవచ్చు. అందుకే ఇప్పుడు కరీంనగర్ కాంగ్రెస్‌లో అవసరమైంది ఆధిపత్య పోరు కాదు.. స్పష్టమైన బాధ్యతలు, సమన్వయ నాయకత్వం, కార్యకర్తలకు అందుబాటులో ఉండే పార్టీ వ్యవస్థ.

సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539 flashindia999@gmail.com

# రూ.345 కోట్ల అభివృద్ధి ప్యాకేజీ

## నేతన్నలకు 'నేతన్న బజార్'.. మహిళా శక్తి భవనానికి శ్రీకారం

- నేతన్నలకు 'నేతన్న బజార్'.. మహిళా శక్తి భవనానికి శ్రీకారం
- రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు
- రాజన్న ఆలయ అభివృద్ధికి రూ.99.40 కోట్లతో పనులు
- కొత్త ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాలకు శంకుస్థాపన



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ముఖ్యమంత్రి హోదాలో ఎన్. రేవంత్ రెడ్డి తొలిసారిగా ఈ నెల 30న రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పర్యటించనున్నారు. గతంలో ప్రతిపక్ష నేతగా మూడుసార్లు సిరిసిల్ల గడ్డపై అడుగుపెట్టిన ఆయన, ఇప్పుడు ముఖ్యమంత్రిగా జిల్లా సమగ్ర రూపురేఖలను మార్చేలా రూ. 345.78 కోట్ల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఈ పర్యటనలో భాగంగా సిరిసిల్ల రగుడు బైపాస్ సమీపంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో సీఎం పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. స్థానిక నేతన్నల సంక్షేమం, మహిళా సాధికారత, విద్యా రంగం , మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం ఈ భారీ నిధులను కేటాయించింది.

**నేతన్నలకు 'నేతన్న బజార్' కొండంత అండ..**

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను, చేనేత-పవర్‌లూమ్ కార్మికులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసింది. సిరిసిల్ల సాంచాలపై ఉత్పత్తి చేసే పెట్టికోట్, పాలియెస్టర్ వస్త్రాల మార్కెటింగ్‌కు వీలుగా కొత్తగా 'నేతన్న బజార్'ను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేశారు. చేనేత, పవర్‌లూమ్ ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడమే దీని ముఖ్య ఉద్దేశం. దీనితో పాటు మున్సిపాలిటీ పరిధిలోని పెద్దూరులో మోడల్‌గా నిర్మించిన ఇందిరా మహిళా శక్తి భవనాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల సమావేశాలు, జీవనోపాధి శిక్షణలతో పాటు వారు ఉత్పత్తి చేసే వస్తువుల విక్రయాలకు ఈ భవనం ప్రధాన కేంద్రంగా నిలవనుంది.

**రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు**

జిల్లాలో విద్యా ప్రమాణాలను పెంచేందుకు సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో రూ. 200 కోట్ల వ్యయంతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను' నిర్మించనున్నారు. పెద్దూరులో 18 ఎకరాల విస్తీర్ణంలో ప్రతిపాదించిన ఈ విద్యా సముదాయంలో 5 నుంచి 12వ తరగతి వరకు సుమారు 2,600 మంది విద్యార్థులకు వసతి, విద్య అందించేలా 64 తరగతి గదులు, డార్మిటరీలు, డైనింగ్ బ్లాక్, క్రీడా మైదానాలను ఏర్పాటు చేయనున్నారు. దీనికితోడు సిరిసిల్ల, కోనరావుపేటలలో ప్రీ-ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు కార్పొరేట్ స్థాయి వసతులు, సైన్స్ ల్యాబ్‌లు, ఐటీ మౌలిక వసతులతో 'తెలంగాణ పబ్లిక్ స్కూల్స్' నిర్మాణాలకు కూడా సీఎం శంకుస్థాపన చేయనున్నారు.

**రాజన్న ఆలయాభివృద్ధికి ₹99.40 కోట్లు.. కొత్త ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ సమగ్ర అభివృద్ధిలో భాగంగా రూ. 99.40 కోట్లతో చేపట్టే 26 రకాల అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం చుట్టనున్నారు. ఇందులో ప్రాకారాలు, గోపురాలు, మండపాల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుదీకరణ, షాపింగ్ కాంప్లెక్సులు ఉన్నాయి. పరిపాలనా సంస్కరణల్లో భాగంగా సిరిసిల్ల, వేములవాడల్లో రెండు కొత్త ఆర్డీఓ కార్యాలయాలు, నాలుగు తహసీల్దార్ కార్యాలయాలు (తంగళ్లపల్లి, వీర్నపల్లి, వేములవాడ రూరల్, రుద్రంగి), సబ్ రిజిస్ట్రార్ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన జరగనుంది. అలాగే వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ కోసం రుద్రంగిలో 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాములను నిర్మించనున్నారు. రక్షణ రంగంలో భాగంగా వేములవాడలో కొత్తగా మహిళా పోలీస్ స్టేషన్, వేములవాడ-సిరిసిల్ల పట్టణాల్లో రెండు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లను ప్రభుత్వం అందుబాటులోకి తేనుంది.

## శ్రీశైలం నీటి వినియోగంపై అభ్యంతరం




**ఆంధ్రప్రదేశ్ :** రెండు తెలుగు రాష్ట్రాల మధ్య జల వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి.. అయితే, శ్రీశైలం జలాశయం నుంచి తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి కోసం నీటిని వినియోగిస్తోందని పేర్కొంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)కి లేఖ రాసింది. రానున్న కేఆర్ఎంబీ సమావేశంలో చర్చించాల్సిన అంశాలు, రాష్ట్ర ప్రతిపాదనలను ఏపీ ప్రభుత్వం బోర్డుకు పంపింది. శ్రీశైలం జలాశయం నుంచి 12 రోజుల్లో స-ుమారు 21 టీఎంసీల నీటిని వినియోగించినట్లు ఏపీ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి లేఖలో పేర్కొన్నారు. ఇందులో ఎక్కువ భాగం తెలంగాణ విద్యుత్ ఉత్పత్తికి వినియోగించినట్లు ఏపీ ప్రభుత్వం తెలిపింది. అందుబాటులో ఉన్న కృష్ణా జలాలను 66:34 నిష్పత్తిలో ఏపీ, తెలంగాణ మధ్య పంపిణీ చేయాలని స్పష్టం చేసింది. ఈ నిష్పత్తి గతంలో కేఆర్ఎంబీ పని విధానంలో కొనసాగిన వ్యవస్థకు అనుగుణంగా ఉందని బోర్డు వార్షిక నివేదికలోనూ నమోదైంది. అలాగే కేఆర్ఎంబీ హెడ్‌క్వార్టర్స్‌ను అమరావతికి మార్చాలని ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించింది. వచ్చే నెల 1న జరగనున్న కేఆర్ఎంబీ సమావేశంలో ఈ అంశాలతో పాటు ఇతర జలవినియోగ అంశాలను చర్చించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. శ్రీశైలం జలాశయం నుంచి విద్యుత్ ఉత్పత్తికి తెలంగాణ నీటిని విడుదల చేస్తున్న అంశంపై ఏపీ అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు తగ్గుతున్న నేపథ్యంలో నీటి వినియోగం, పంపిణీపై ఇరు రాష్ట్రాల మధ్య భిన్నాభిప్రాయాలు కొనసాగుతున్నాయి.

# నిమ్స్ ఆస్పత్రి ఉద్యోగుల ఇళ్లలో ఏసీబీ సోదాలు




**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) అదనపు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నోరి లక్ష్మీ భాస్కర్ ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అవినీతి నిరోధక శాఖ సోదాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం నిమ్స్ ఉద్యోగుల ఇళ్లలోనూ ఏసీబీ సోదాలు చేపట్టింది. ఈ సోదాల్లో ఇప్పటి వరకూ రూ.7 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. డాక్టర్ లక్ష్మీ భాస్కర్‌ను ఇటీవలే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన అధికారులు, ఆయన నివాసంతో పాటు బంధువులు, బినామీలకు చెందిన ప్రాంతాల్లో వరుస తనిఖీలు చేపట్టారు.ఏసీబీ ప్రాథమిక దర్యాప్తు ప్రకారం దస్త్రాల పరంగా రూ. 6.13 కోట్ల నమోదు విలువ కలిగిన ఆస్తులను గుర్తించగా, వాటి బహిరంగ మార్కెట్ విలువ రూ. 80 కోట్ల నుంచి రూ. 100 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేశారు. సోదాల్లో నగదుతో పాటు 517.8 గ్రాముల బంగారు ఆభరణాలు, విలాసవంతమైన జాగ్వార్, ఆడీ, టాటా నెక్సాన్ కార్లతో పాటు పలు ద్విచక్ర వాహనాలను కూడా ఏసీబీ స్వాధీనం చేసుకుంది. వీటితో పాటు కూకట్‌పల్లి, మణికొండ ప్రాంతాల్లో విలాసవంతమైన ఫ్లాట్లు, వైజాగ్ సహా పలు ప్రాంతాల్లో ఓపెన్ ప్లాట్లు ఉన్నట్లు గుర్తించారు. అలాగే వివిధ బ్యాంకు ఖాతాల్లో రూ. 41 లక్షలు, పోస్టాఫీస-ుల్లో రూ. 12 లక్షలు, ప్రైవేట్ ఫైనాన్స్ మరియు మ్యూచువల్ ఫండ్స్‌లో దాదాపు రూ. 64.55 లక్షల పెట్టుబడులను ఏసీబీ అధికారులు తేల్చారు. ఆసుపత్రి అడ్మిషన్లు, ల్యాబ్ పరికరాల కొనుగోళ్లు, కమీషన్ల ద్వారా ఈ అక్రమార్జనకు పాల్పడినట్లు అనుమానిస్తున్న అధికారులు, ఈ వ్యవహారంలో మరికొందరు ఉద్యోగుల ప్రమే-యం ఉందో లేదో తెలుసుకునేందుకు దర్యాప్తు వేగవంతం చేశారు.

# కలెక్టర్ జాబ్ వదిలేసి రాజకీయాల్లోకి..

**ఉత్తరప్రదేశ్ :** యూపీ కేడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారిణి దివ్య మిట్టల్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. 13 ఏళ్ల సర్వీస్‌కు గత నెలలో గుడ్ బై చెప్పిన ఆమె తన భవిష్యత్ కార్యాచరణపై క్లారిటీ ఇచ్చారు. ఇక తాను రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్నట్లు మంగళవారం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు. ఉత్తరప్రదేశ్ తన ఖర్మభూమి అని, ఈ రాష్ట్రమే తన రాజకీయ ప్రయాణానికి ఆరంభస్థానమని పేర్కొన్నారు. ఈ మేరకు ఓ వీడియో రిలీజ్ చేసిన ఆమె.. తాను పదవిలో ఉండగా చూసిన అనుభవాల నుంచే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. నిధులు, అనుమతులు, నియ-ుమావళి ఉన్నప్పటికీ ప్రజల అనేక సమస్యలు పరిష్కారం కాకపోవడాన్ని నేను గమనించానని పేర్కొన్నారు. కొంతమంది వ్యక్తుల స్వరం ప్రభుత్వానికి చేరడం లేదు, ఒకవేళ చేరినా వారి సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని అన్నారు.

**గత నెలలో రాజీనామా:**

2013 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ ఆఫీసర్ దివ్య మిట్టల్.. తన 13 ఏళ్ల సుదీర్ఘ కెరీర్ ను ముగిస్తూ గత ఆగస్టు 30 ఉద్యోగానికి రాజీనామా చేశారు. తాను ఈ పదవిని వీడుతున్నప్పటికీ సేవ వైపు తనను ఆకర్షించిన గొప్ప కల మాత్రం కొనసాగుతుందని రాజీనామా లేఖలో పేర్కొన్నారు. ఒక నాడు నా కోసం నేను కన్న వ్యక్తిగత కలలు నె-రవేరాయి. ఇక ఇప్పుడు తాను ఇతరుల కోసం కన్న కలల కోసం జీవించాలనుకుంటున్నాను అని తెలిపారు. పదవిలో ఉండగా ఆమె పని చేసిన జిల్లాల్లో చేపట్టిన కార్యక్రమాల ద్వారా గుర్తింపు పొందిన దివ్య మిట్టల్ కెరీర్‌లో మిర్జాపుర్ జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన కాలం ప్రత్యేకం. 2022 సెప్టెంబర్ నుంచి 2023 సెప్టెంబర్ వరకు మిర్జాపుర్ కలెక్టర్‌గా పని చేసిన ఆమె.. అక్కడ మారుమూల కొండ ప్రాంతంలోని లహురియా దేహ్ గ్రామానికి ఎన్నో ఏళ్లుగా లేని తాగునీటి సౌకర్యాన్ని అందించి అక్కడి ప్రజల మనసులు గెలుచుకోగలిగారు. తన రాజీనామా సందేశంలోనూ మిర్జాపుర్ తనకు 'అసాధ్యం అనేది వాస్తవం కాదు. అది కేవలం ఒక అభిప్రాయం మాత్రమే' అని నేర్పించిందని ఆమె ప్రత్యేకంగా ప్రస్తావించారు.

**ఎన్నికల వేళ సంచలన పరిణామం:**

పని తీరులో తనదైన స్టైల్ లో వ్యవహరించే దివ్య మిట్టల్ కు సోషల్ మీడియాలోను మంచి ఫాలోయింగ్ ఉంది. ఈ నేపథ్యంలో అనూహ్యంగా ఆమె గత నెలలో ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి ఎంట్రీ ఇస్తున్నట్లు ప్రకటించడం చర్చగా మారింది. వచ్చే ఏడాది ప్రారంభంలో యూపీ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో ఆమె రాజకీయ రంగప్రవేశంపై ప్రకటన చేయడంతో ఆసక్తిగా మారింది. అయితే తాను ప్రస్తుతం ఉన్న ఏ రాజకీయ పార్టీలో చేరబోనని మిట్టల్ స్పష్టం చేశారు. దీంతో ఎన్నికల నాటికి ఆమె పొలిటికల్ కెరీర్ ఎలా ఉండబోతోంది అనేది ఉత్కంఠగా మారింది. నిజానికి తన సర్వీస్ సమయంలో కొంత మంది పాలకుల తీరు నచ్చకే పదవికి రాజీనామా చేశారనే ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో దివ్య మిట్టల్ ఎలాంటి వ్యూహాలతో పొలిటికల్ కెరీర్‌ను నిర్మించుకోబోతున్నారు అనేది వేచి చూడాలి.

# ఊట్కూర్ శివారులో వేట..

## కృష్ణజింకకు తూటా.. పట్టుబడ్డ ముఠా




**ఊట్కూర్,ఫ్లాష్ ఇండియా :** నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల శివారులో కృష్ణ జింక వేట వ్యవహారం కలకలం రేపింది. నిడుగుర్తి--లక్ష్మీపల్లి గ్రామాల మధ్య అటవీ జింకను కాల్చి, మాంసాన్ని హైదరాబాద్‌కు తరలించే క్రమంలో పోలీసులకు చిక్కారు. షాద్‌నగర్ సమీపంలోని రాయికల్ టోల్‌ప్లాజా వద్ద జరిగిన తనిఖీల్లో తొమ్మిది మంది పట్టుబడటంతో ఊట్కూర్ శివారులో జరిగిన వేట వ్యవహారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల తనిఖీల్లో నిందితులు ప్రయాణిస్తున్న వాహనం నుంచి సుమారు 13 కిలోల కృష్ణ జింక మాంసం లభించింది. అంతేకాకుండా సైలెన్సర్, టెలిస్కోప్‌తో కూడిన .315 రైఫిల్, కెమెరా, సెల్‌ఫోన్లు, రూ.28,500 నగదును అధికారులు స్వా-ధీనం చేసుకున్నారు. ఈ వివరాలను షాద్‌నగర్ డీసీపీ శిరీష మీడియాకు వెల్లడించారు.

**ఊట్కూర్‌కు లింక్..**

ఈ వ్యవహారంలో ఊట్కూర్ మండలానికి చెందిన ఎండీ రియాజ్ కూడా నిందితుడిగా ఉండటం స్థానికంగా ప్రాధాన్యం సంతరించుకుంది. పోలీసుల విచారణలో వేట జరిగిన ప్రాంతం నిడుగుర్తి-లక్ష్మీ పల్లి శివారులోని అటవీ ప్రాంతంగా గుర్తించారు. దీంతో షాద్‌నగర్ పోలీసులు, నారాయణపేట అటవీశాఖ అధికారులు అక్కడికి చేరుకుని క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. కృష్ణజింకను ఏ ప్రాంతంలో కాల్చారు.. వేట అనంతరం కళేబరాన్ని ఎక్కడ ముక్కలు చేశారు.. మాంసాన్ని ఏ మార్గంలో తరలించారు అనే కోణాల్లో అధికారులు ఆధారాలు సేకరించారు. నిందితులను ఘటనాస్థలానికి తీసుకెళ్లి వారి నుంచి వివరాలు తెలుసుకున్నట్లు సమాచారం.

**రైఫిల్ లైసెన్స్ ఉన్నా..**

హైదరాబాద్‌కు చెందిన ఎండీ హాజీ ఉద్దీన్‌తో పాటు మీర్ ముక్తార్ అలీ, ఎండీ తాజుముల్, మీర్ రజా అలీఖాన్, ఖుర్రం ఖాన్, సయ్యద్ సల్మాన్ అలీ, ఎండీ ఆఫ్రోజ్ ఖాన్, ఎండీ అబ్దుల్ అజీజ్, ఎండీ రియాజ్‌లపై కేసు నమోదైంది. రైఫిల్‌కు లైసెన్స్ ఉన్నప్పటికీ దానిని వన్యప్రాణి వేటకు ఉపయోగించడం నేరమని అధికారులు తెలిపారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం--1972, ఆర్మ్స్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# గ్రామాల్లో నక్షబాటలను వెలికి తీయండి



**కేశంపేట,ఫ్లాష్ ఇండియా :** గ్రామాల్లో ఏళ్లుగా పరిష్కారం కాని బాట సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు నక్షబాటలను వెలికి తీయాలని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధికారులను ఆదేశించారు. కేశంపేట మండల కేంద్రంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అన్ని శాఖల పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లోని పాత నక్షబాటలు, రైతులు పొలాలకు వెళ్లే దారులను గుర్తించి వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని తహసీల్దార్ కు సూచించారు. నక్షబాటలు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, అవసరమైన చోట వాటిని పునరుద్ధరించాలని ఎమ్మెల్యే తెలిపారు. బాటల విషయంలో గ్రామాల్లో తరచూ వివాదాలు తలెత్తుతున్నాయని, నక్షబాటలను గుర్తించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ఇటువంటి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. అధికారులు గ్రామాల వారీగా నక్షబాటల వివరాలను సేకరించి, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతులు, గ్రామీణ ప్రజలకు రాకపోకల విషయంలో ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ శ్రీధర్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి ఉమాదేవి, ఎంపీడీఓ రవిచంద్ర కుమార్ రెడ్డి, తహసీల్దార్ రాజేందర్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్ లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కేటీఆర్‌కు కవిత వార్నింగ్



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** నియోజకవర్గానికి ఎమ్మెల్యేనే సీఎం అని కేసీఆర్ చెప్పడం వల్లే సమస్యలు తమ వరకు రాలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై టీఆర్ఎస్ చీఫ్ కవిత ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. కూర్చున్న కొమ్మనే నరుక్కున్నట్టు.. పార్టీలో మీ వైఫల్యాన్ని.. మీ చేతగాని తనాన్ని బీఆర్ఎస్ అధినేతపై మోపుతున్నావు అంటే... ప్రత్యక్ష రాజకీయాల్లో మీ స్థానం ఏమిటో అర్థమవుతుందా? అంటూ మండిపడ్డారు. గుంటనక్క మైండ్ గేమ్‌లో బ్లైండ్‌గా పడిపోయి పెద్ద మనిషినే తప్పు బడుతున్నారని, బీఆర్ఎస్‌కు గోతి తవ్వుతున్నారు అంటూ సంచలన కామెంట్స్ చేశారు. తాను బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు ఒక అవినీతి గుంటనక్కను విమర్శిస్తే కొన్ని గంటల్లోనే సస్పెండ్ చేశారని.. అదే గుంటనక్కతో అంటకాగుతూ బీఆర్ఎస్ అధినేత తీరుతోనే నష్టపోయామని మీరు బహిరంగంగా వ్యాఖ్యలు చేయడం పార్టీ వ్యతిరేకం కాదా? అని ప్రశ్నించారు. పార్టీ అధినేత కేసీఆర్‌ను విమర్శించడం, ఆయన తీసుకున్న విధానపరమైన నిర్ణయాలను బాహాటంగా తప్పుపట్టడం పార్టీ వ్యతిరేక చర్య కాదా అని అన్నారు. ఫామ్ హౌస్ లు, అక్రమంగా ఇచ్చిన పర్మిషన్లు.. ఆంధ్రా దోస్తులకు ఇచ్చిన నజరానాలు.. క్విడ్ ప్రో కో దందాలతో బీఆర్ఎస్ పార్టీని పాతాళంలోకి నెట్టింది మీరు కాదా? అంటూ సంచలన ఆరోపణలు చేశారు. నిన్నటి బీఆర్ఎస్ మీటింగులో ఓ రైతు ఫోన్ మాట్లాడుతుంటే "నీ పెండ్లామా!? అంత అర్జెంటా!? అని అహంకారంతో అతని భార్యనే అవమానించారని, ఒక మహిళ సాయం కోరి వస్తే నా కోసం కన్నావా..? అని అమ్మనే అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిమజ్జనోత్సవంలో ఎంతమంది సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్లను బతిమాలుకున్నారో ఆ గణేష్ మహారాజుకు, వాళ్ల అంతరాత్మకు తెలుసని పేర్కొన్నారు. తాను విష నాగుల మాటలు విని మాట్లాడనని, నిర్దిష్టమైన ఆధారాలతోనే మాట్లాడుతానని కవిత పేర్కొన్నారు. నాతో పెట్టుకోవద్దు అంటూ వార్నింగ్ ఇచ్చారు.



# నాకు బాధగా లేదు..

**వరంగల్,ఫ్లాష్ ఇండియా :** తనకు మంత్రి పదవి పోవడం బాధగా లేదని ఎమ్మెల్యే కొండా సురేఖ వ్యాఖ్యానించారు. మంత్రిగా ఉంటే రాష్ట్రస్థాయిలో సేవచేసే అవకాశం తనకు ఉండేదని పేర్కొన్నారు. ఈరోజు(మంగళవారం) వరంగల్ జిల్లాలోని తన క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను కొండా సురేఖ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.

**మా అనుచరులపై ఈగవాలిన ఊరుకోం..**

ఇప్పుడు వరంగల్ నియోజకవర్గంపై దృష్టి సారించి అభివృద్ధి చేసే అవకాశం తనకు వచ్చిందని కొండా సురేఖ వెల్లడించారు. ఇకపై నియోజకవర్గంలో అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పుకొచ్చారు. వచ్చే వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఎక్కువ స్థానాలను గెలవడమే తమ లక్ష్యమని వ్యాఖ్యానించారు. తమ అనుచరులపై ఈగవాలిన ఊరుకోబోమని హెచ్చరించారు. మొన్న ఎంజీఎం దగ్గర బీఆర్ఎస్ నేతలు అత్యుత్సాహం ప్రదర్శించారని ధ్వజమెత్తారు.

**వరంగల్ అభివృద్ధిపై బీజేపీకి సవాల్..**

వాళ్లు వాళ్లే తోసేసుకుని పోలీసులు కొట్టారని ఆస్పత్రిలో జాయిన్ అయ్యారని కొండా సురేఖ విమర్శించారు. కొత్త కలెక్టరేట్ దగ్గర బీజేపీ నాయకులు నిరసన తెలిపి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఆగ్రహించారు. వరంగల్ అభివృద్ధిపై బీజేపీ నాయకులకు సవాల్ చేశారు. వరంగల్‌లో పురాతన ప్రదేశాలను అభివృద్ధి చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువచ్చి.. అప్పుడు మాట్లాడాలని కొండా సురేఖ ఛాలెంజ్ చేశారు.

# భూగర్భ జలాలను పరిరక్షించాలి...

**వాటర్ ఫిల్టర్‌ల నీటి వృథాపై కఠిన చర్యలు • ఇంకుడు గుంతలు తప్పనిసరి • జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్‌కు వినతి**



**మేడ్చల్,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** భూగర్భ జలాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని గ్రేటర్ పరిధిలో అనుమతులు లేకుండా నీటి వ్యాపారం నిర్వహిస్తూ, వాటర్ ఫిల్టర్ ప్లాంట్ల నుంచి వెలువడుతున్న వ్యర్థజలాలను విచ్చలవిడిగా రోడ్లపై, డ్రైనేజీలు, ఓపెన్ నాలాల్లోకి వదులుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సామాజిక, పర్యావరణ ప్రేమికుడు కోలా రవీందర్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. దీనిపై ప్రజావాణిలో జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్‌కు సామాజిక, పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్, గోపాల్‌రెడ్డి, విజపీ మల్లేష్ వినతిపత్రం సమర్పించారు. వాటర్ ఫిల్టర్ ప్రక్రియలో వృథాగా వెలువడే నీటిని బయటకు వదలకుండా ప్రతి ఫిల్టర్ యజమాని తమ ఆవరణలో ఇంకుడు గుంత ఏర్పాటు చేసి, వ్యర్థజలాలను అందులోకి మళ్లించేలా నిబంధనలు విధించాలని కోరారు.నీటిని శుద్ధి చేసి వ్యాపారం చేస్తున్న ఫిల్టర్ యజమానులు, శుద్ధి ప్రక్రియలో వెలువడే నీటిని బాధ్యత లేకుండా రోడ్లపై, డ్రైనేజీల్లోకి వదలడం వల్ల నీటి వృథాతో పాటు పరిసరాల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకించాల్సిన సమయంలో ఇలాంటి నీటిని కూడా వృథా చేయడం వల్ల భూగర్భ జలాల పరిరక్షణకు విఘాతం కలుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.నీటి వ్యాపారం నిర్వహిస్తున్న ఫిల్టర్ కేంద్రాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని నిబంధనలు ఉల్లంఘిస్తూ నీటిని బయటకు వదులుతున్న ఫిల్టర్ కేంద్రాలను సీజ్ చేయడంతో పాటు భారీ జరిమానాలు విధించాలని అధికారులను కోరారు.ప్రతి వాటర్ ఫిల్టర్ కేంద్రంలో ఇంకుడు గుంత తప్పనిసరి చేసి, నీటి వృథాకు అడ్డుకట్ట వేయాలని వారు విజ్ఞప్తి చేశారు. భవిష్యత్‌లో నీటి కొరత తీవ్ర రూపం దాల్చకుండా ఇప్పటి నుంచే అధికారులు కఠినంగా వ్యవహరించాలని కోరారు.



## కరాటే లీగ్ పోటీలో గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థిని

**వలిగొండ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**
యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం గోపరాజుపల్లి గ్రామానికి చెందిన సంగిశెట్టి సాన్వి కరాటే పోటీలో గోల్డ్ మెడల్ సాధించింది. సాన్వి మండల కేంద్రంలోని పవిత్రాత్మ స్కూల్లో ఏడవ తరగతి చదువుతుంది. ఇటీవల 2026 కేల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా కరాటే లీగ్ పోటీలు నిర్వహించగా పోటీలో గెలుపొంది గోల్డ్ మెడల్ సాధించింది. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, బంధువులు, స్కూల్ యాజమాన్యం అభినందనలు తెలిపారు.

## జన గణనలో ఓబీసీ కాలము చేర్చాల్సిందే...



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**
జాతియ జనగణలో ఎస్సీ,ఎస్టీ లతోపాటు ఓబీసీ కాలమును కూడా చేర్చాల్సిందేనని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 8న ఢిల్లీలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ తెలిపారు. గతంలో కేంద్ర ప్రభుత్వం ఓబిసి గణన చేపడతామని హామీ ఇచ్చి ఈరోజు ఆ యొక్క హామీని విస్మరించిందని,కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాల్సినటువంటి మిగతా పార్టీలు ప్రేక్షక పాత్ర వహిస్తున్నాయని అన్నారు.జనగణన పై జాతీయ స్థాయిలో అఖిలపక్ష పార్టీల మేధావుల కుల సంఘాల సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.బీసీల పట్ల కేంద్ర ప్రభుత్వానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న వెంటనే 40 ప్రశ్నలతో కూడిన గెజిట్ నోటిఫికేషన్ రద్దు చేయాలని అన్నారు.బిజెపి ప్రభుత్వం పూర్తి బీసీ వ్యతిరేక చర్యలకు పాల్పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు,ఎర్రబెల్లి దుర్గయ్య,రాంబాబు యాదవ్, నక్క నాగరాజు,తాడూరి సైదులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రాకకు సర్వం సిద్ధం..

**కరీంనగర్,ఫ్లాష్ ఇండియా :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రేపు(బుధవారం) కరీంనగర్‌లో పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. నూతన సమీకృత కలెక్టరేట్ భవనం ప్రారంభోత్సవంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో సీఎం పాల్గొననున్నందున భద్రత, ప్రోటోకాల్, ట్రాఫిక్, పార్కింగ్, ఇతర ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ చిత్రామిశ్రా తెలిపారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ చిత్రామిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం సీఎం భద్రతా అధికారులతో కలిసి నూతన కలెక్టరేట్ భవనంలోని ఏర్పాట్లను పరిశీలించారు. సమావేశ మందిరం, కలెక్టర్ ఛాంబర్, అదనపు కలెక్టర్ ఛాంబర్‌తో పాటు సీఎం పర్యటనలో వినియోగించే ప్రాంతాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఎక్కడా చిన్నపాటి లోపానికి కూడా అవకాశం లేకుండా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేస్తూ తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. సీఎం పర్యటన సందర్భంగా భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, విద్యుత్, పరిశుభ్రత, ప్రోటోకాల్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమాలు సజావుగా జరిగేలా ప్రతి అంశాన్ని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్వో స్వామి, వివిధ శాఖల అధికారులు, సీఎం భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.

# పేదలకి అండగా సీఎం సహాయ నిధి



**మోతె, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 41 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ.17,06,550 విలువైన చెక్కులను ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి మంగళవారం క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యంతో వైద్య చికిత్సలు పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ అండగా నిలుస్తోందన్నారు. వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తోందని తెలిపారు.అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనం అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. మోతే మండలానికి మొత్తం రూ.17,06,550 సీఎంఆర్ఎఫ్ సాయం మంజూరైనట్లు తెలిపారు.చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు

# జడ్పీ సీఈఓ ఆకస్మిక తనిఖీ



**మోతె, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** మోతే మండల పరిషత్ కార్యాలయాన్ని జెడ్పీ సీఈఓ శిరీష మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో కొనసాగుతున్న పింఛన్ల వెరిఫికేషన్, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియపై ఎంపీడీవో, ఎంపీవోలను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**రిజిస్టర్లను పరిశీలించిన సీఈఓ**

పింఛన్ల వెరిఫికేషన్ ఎంతవరకు పూర్తయింది, ఏ విధంగా పరిశీలన చేస్తున్నారనే అంశాలపై ఆరా తీశారు. సంబంధిత రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించి సంతకాలు చేయడంతో పాటు, వివరాలను పూర్తిగా నమోదు చేయాలని అధికారులకు సూచించారు.

**వీవీజీ రాంజీ పనులపై సమీక్ష**

వీవీజీ రాంజీ పథకం కింద చేపడుతున్న పనుల ప్రణాళిక, అంచనాలు, పనుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ తనిఖీలో ఎంపీడీవో సందీప్ కుమార్, ఎంపీవో వంశీ, ఈసీ శ్రీహరి పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఓటర్లందరూ తమ ఓటును వెంటనే నమోదు చేసుకోవాలి


Form-18
ELECTION COMMISSION OF INDIA
Claim for inclusion of name in the electoral roll for a Graduates' Constituency



**మిర్యాలగూడ ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:**
మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని అర్హులైన పట్టభద్రులందరూ రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం తమ ఓటును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ మిర్యాలగూడ నియోజకవర్గ ఇంచార్జ్ నల్లమోతు భాస్కర్ రావు విజ్ఞప్తి చేశారు.తాను కూడా మంగళవారం తన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటును నమోదు చేసుకున్నట్లు తెలిపారు. అదే విధంగా మిర్యాలగూడ నియోజకవర్గంలోని అర్హులైన పట్టభద్రులు ఎలాంటి ఆలస్యం చేయకుండా తక్షణమే తమ పేర్లను పట్టభద్రుల ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని కోరారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని,అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు తన ఓటు హక్కును వినియోగించుకునేలా ముందుగానే నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని భాస్కర్ రావు సూచించారు.“నేను నా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటును ఈరోజే నమోదు చేసుకున్నాను. మీరు కూడా ఆలస్యం చేయకుండా మీ ఓటును వెంటనే నమోదు చేసుకోండి” అని పట్టభద్రులకు ఆయన పిలుపునిచ్చారు.

## ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వేగవంతం చేసి, లక్ష్యాన్ని 70శాతం దాటించాలి




**మేడ్చల్,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వేగవంతం చేసి లక్ష్యాన్ని 70 శాతం దాటించాలని క్షేత్రస్థాయి సిబ్బందిని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలు సన్నాహాలు, రైతుల సంక్షేమంపై నిర్వహించిన సమీక్షా సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. రాబోయే ఖరీఫ్ సీజన్ లో ధాన్యం కొనుగోలు వేగవంతం చేయడానికి మరియు సన్నాహాలను సమీక్షించడానికి జిల్లా అధికారులు, పౌర సరఫరాల శాఖ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు (AOs), వ్యవసాయ విస్తరణ అధికారులు (AEOs) మరియు కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జులతో ఒక ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి మండలానికి కనీసం ఒక కొనుగోలు కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలని, స్థల సేకరణ, రవాణా ఆలస్యం కాకుండా నివారించేందుకు జిల్లాల్లో ప్రత్యామ్నాయ గోదాములు అదనపు నిల్వ స్థలాలను గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని కేంద్రాల్లో గన్నీ బ్యాగులు, టార్పాలిన్ షీట్లు, సుత్తిలి, మాయిశ్చర్ మీటర్లు (తడి కొలిచే పరికరాలు) మరియు ఆటోమేటిక్ క్లీనింగ్ మిషన్లు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యాన్ని గోదాములకు తరలించేందుకు తగినన్ని వాహనాలను సిద్ధం చేయాలని రవాణా కాంట్రాక్టర్లను కలెక్టర్ ఆదేశించారు. తహసీల్దార్లతో సమన్వయం చేసుకొని ధాన్యం ఆరబోసుకోవడానికి అదనపు స్థలం కోసం కేంద్రాల సమీపంలో ఉన్న ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఖాళీ స్థలాలను పరిశీలించాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా సివిల్ సప్లై డిఎం సుగుణ బాయి, సివిల్ సప్లై అధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత



**ఎల్లారెడ్డిపేట,ఫ్లాష్ ఇండియా :** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. గతంలో వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి ఏటా రూ.100 కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చినా, ఆ మేరకు అభివృద్ధి జరగలేదని ఆయన పేర్కొన్నారు. మంగళవారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మాజీ సర్పంచ్ నే వూరి వెంకట్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయాన్ని వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.జగద్గురు ఆదిశంకరాచార్యుల మఠం సూచనలు, హిందూ ధర్మ సంప్రదాయాలకు అనుగుణంగా ఆలయ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. అదేవిధంగా బాసరలో సరస్వతి అమ్మవారి ఆలయం, ధర్మపురిలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, కాళేశ్వరంలో ముక్తేశ్వర స్వామి ఆలయం, భద్రాద్రిలో శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఉన్నప్పటికీ గోదావరి పుష్కరాల నేపథ్యంలో రూ.1,000 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసిందని మంత్రి తెలిపారు.సిరిసిల్ల నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న భూముల పై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పేద విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. ప్రభుత్వ హాస్టళ్లు, గిరిజన సంక్షేమ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు కాస్మోటిక్, డైట్ చార్జీలు పెంచినట్లు చెప్పారు. తాను జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఉన్న సమయంలో సిరిసిల్ల ఎమ్మెల్యేగా ఉన్న కేటీఆర్ తన దృష్టికి తీసుకొచ్చిన పలు సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నామని మంత్రి గుర్తుచేశారు.సిరిసిల్ల నియోజకవర్గంలో పలు సమస్యలు తమ దృష్టికి వస్తున్నాయని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. సిరిసిల్ల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 30న సిరిసిల్లలో నిర్వహించే బహిరంగ సభకు హాజరవుతున్నారని తెలిపారు. సభకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సూది రాజేందర్, మాజీ అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ నెహ్రూ వెంకట్‌రెడ్డి, సర్పంచుల పూర్వ అధ్యక్షుడు దొమ్మాటి నరసయ్య, కాంగ్రెస్ నాయకులు చేపూరి రాజేశం, గుప్తాం బండారి బాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, గుర్రాల రాజిరెడ్డి, వంగ శ్రీకాంత్‌రెడ్డి, మారి శ్రీనివాస్‌రెడ్డి, సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరాముని పై అనుచిత వ్యాఖ్యలు తగదు



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**
హిందువుల ఆరాధ్య దైవం శ్రీరాముని మీద అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ మిర్యాలగూడ పట్టణంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో రాజీవ్ గాంధీ విగ్రహం కింద దిష్టిబొమ్మ దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటుకు నోటు కేసులో నిందితుడైన రేవంత్ రెడ్డి హిందువుల ఆరాధ్య దైవం శ్రీరాముని పై అనుచిత వాక్యాలు చేయడం తగదు అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని శ్రీను,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బంటు సైదులు,పట్టణ వన్ టౌన్‌అధ్యక్షుడు బంటుగిరి,ప్రధాన కార్యదర్శి మూల రాజిరెడ్డి,ఓబిసి జిల్లా ఉపాధ్యక్షుడు బంటు యాదగిరి,ఓబిసి పట్టణ అధ్యక్షుడు బొడ్డు సోములు, మోదుగుల అశోక్,రవికుమార్, పల్ల శీను,చాగాని వెంకన్న,కుర్ర సాయి,మల్లికంటే సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

## అడవి పంది దాడిలో మహిళకు తీవ్ర గాయాలు



**కాగజ్ నగర్,ఫ్లాష్ ఇండియా :** చేను పనులు చేసుకుంటున్న ఓ మహిళపై అడవి పంది అకస్మాత్తుగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టీ) మండల పరిధిలోని డోర్పల్లి గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. డోర్పల్లి గ్రామానికి చెందిన డోంగ్రీ లక్ష్మి బాయి అనే మహిళ మంగళవారం గ్రామ సమీపంలోని తన చేనులో వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉంది. అదే సమయంలో అడవి నుంచి ఒక్కసారిగా దూసుకొచ్చిన క్రూరమైన అడవి పంది ఆమెపై విచక్షణారహితంగా దాడికి తెగబడింది. ఈ అనూహ్య దాడితో లక్ష్మి బాయి గట్టిగా కేకలు వేయడంతో గమనించిన సమీప రైతులు, స్థానికులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పందిని తోలివేశారు. అప్పటికే ఆమెకు శరీరంపై తీవ్ర గాయాలయ్యాయి. రక్తసిక్తమైన లక్ష్మి బాయిని స్థానికులు, కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు వైద్యులు అత్యవసర చికిత్స అందిస్తున్నారు. పొలాల్లో పనులు చేసుకుంటున్న సమయంలో ఇలా అడవి పందులు దాడులు చేస్తుండటంతో చుట్టుపక్కల గ్రామాల రైతులు, కూలీలు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీ శాఖ అధికారులు తక్షణమే స్పందించి అడవి పందుల సంచారాన్ని అరికట్టాలని, గ్రామస్థులు కోరుతున్నారు.

# మిల్లర్, బవుమా సెంచరీలు..



కెప్టెన్ టెంబా బవుమా (103), డేవిడ్ మిల్లర్ (142) సెంచరీలతో దంచికొట్టడంతో.. ఆదివారం రాత్రి జరిగిన రెండో వన్డేలో సౌతాఫ్రికా 32 రన్స్ తేడాతో ఆస్ట్రేలియాపై విజయం సాధించింది. ఫలితంగా మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను మరోటి మిగిలి ఉండగానే 2--0తో కైవసం చేసుకుంది. టాస్ ఓడిన సౌతాఫ్రికా 50 ఓవర్లలో 365/9 స్కోరు చేసింది. మాథ్యూ బ్రీట్జ్‌కే (34), డువాన్ జాన్సెన్ (27 నాటౌట్) ఫర్వాలేదనిపించారు. జాక్ ఎడ్వర్డ్స్ 5, హాజిల్‌వుడ్ 3 వికెట్లు తీశారు. తర్వాత ఆసీస్ 49.5 ఓవర్లలో 333 రన్స్‌కు ఆలౌటైంది. మిచెల్ మార్ష్ (84), ట్రావిస్ హెడ్ (84), జేవియర్ బార్ట్‌లెట్ (50) హాఫ్ సెంచరీలు చేసినా ప్రయోజనం దక్కలేదు. మ్యాట్ రెన్‌షా (32), జాక్ ఎడ్వర్డ్స్ (25) పోరాడి విఫలమయ్యారు. లిజాద్ విలియమ్స్ 3 వికెట్లు పడగొట్టాడు. మిల్లర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. ఇరుజట్ల మధ్య పాచెఫ్‌స్ట్రూమ్‌లో బుధవారం మూడో వన్డే జరుగుతుంది.

# ఏషియన్ గేమ్స్‌లో భారత్‌కు మరో స్వర్ణం






ఏషియన్ గేమ్స్ 2026లో భారత్ మరో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. మహిళల ట్రాప్ షూటింగ్‌లో నీరు ధండా స్వర్ణ పతకాన్ని గెలిచింది. దీంతో వ్యక్తిగత ట్రాప్ ఈవెంట్‌లో స్వర్ణం సాధించిన తొలి భారత మహిళగా నీరు చరిత్ర సృష్టించింది. వ్యక్తిగత ట్రాప్ ఈవెంట్ ఫైనల్స్‌లో మొత్తం 8మంది పోటీపడగా నీరు 28 పాయింట్ల స్కోర్ సాధించి, 24 పాయింట్ల పాత ఏషియన్ గేమ్స్ రికార్డును కూడా బద్దలు కొట్టింది. దీంతో ఆమె 26 పాయింట్లతో ముగించిన చైనా క్రీడాకారిణి యునాంగ్ సన్‌ను అధిగమించింది. ఇక నేటితో ఏషియన్ గేమ్స్ ప్రారంభమై 11రోజులు కాగా నేడు సర్ఫింగ్, ఆర్చరీ, కురాష్, ట్రాక్ సైక్లింగ్, షూటింగ్, స్క్వాష్, కానో స్లాలోమ్, సెయిలింగ్, టెన్నిస్, బాక్సింగ్ ఇతర క్రీడల్లో భారత క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఇక నిన్న వివిధ విభాగాల్లో దేశానికి ఏకంగా ఎనిమిది పతకాలు వచ్చాయి కానీ గోల్డ్ దక్కలేదు. నిన్న జరిగిన పోటీల్లో నాలుగు రజతాలు, నాలుగు కాంస్య పతకాలు వచ్చాయి.

# ఏదైనా చేయాలనుంది..

టీమిండియా మాజీ పేసర్, స్వింగ్ మాస్టర్ ప్రవీణ్ కుమార్ మరోసారి భారత క్రికెట్‌లో కీలక పాత్ర పోషించేందుకు సిద్ధమవుతున్నారు. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఏర్పాటు చేయనున్న జూనియర్ సెలెక్షన్ కమిటీలో సభ్యుడిగా బాధ్యతలు చేపట్టేందుకు ఆయన దరఖాస్తు చేసుకున్నారు. దేశవ్యాప్తంగా గ్రాస్‌రూట్ స్థాయి నుంచి యువ ప్రతిభను గుర్తించి.. తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్యానెల్‌ను ఏర్పాటు చేయాలని బీసీసీఐ నిర్ణయించిన నేపథ్యంలో ప్రవీణ్ కుమార్ ఈ పదవికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా వెల్లడించారు.భారత క్రికెట్‌కు తన వంతు సేవ చేయాలనే ఉద్దేశంతోనే దరఖాస్తు చేసుకున్నట్లు ప్రవీణ్ కుమార్ తెలిపారు. కోచింగ్‌లో అనుభవం ఉండటంతో పాటు ఉత్తరప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ (యూపీసీఏ)లో సెలెక్టర్‌గా కూడా పనిచేసిన అనుభవం తనకు ఉందని చెప్పారు. 'అవును.. జూనియర్ సెలెక్షన్ కమిటీ కోసం దరఖాస్తు చేసుకున్నాను. నేను రిటైర్ అయ్యాను. ఇప్పుడు భారత క్రికెట్‌కు నా వంతు సహకారం అందించాలని అనుకుంటున్నాను. గతంలో కోచింగ్ చేశాను. యూపీసీఏలో సెలెక్టర్‌గా కూడా పనిచేశాను. అందుకే ఈ పదవికి దరఖాస్తు చేయాలని భావించాను' అని ప్రవీణ్ కుమార్ తెలిపారు.దేశవ్యాప్తంగా ప్రతిభావంతులైన యువ క్రికెటర్లను గుర్తించి వారికి సరైన మార్గనిర్దేశం అందించడమే ఈ కొత్త జూనియర్ సెలెక్షన్ ప్యానెల్ ప్రధాన లక్ష్యం. గ్రాస్‌రూట్ స్థాయిలో ప్రతిభను గుర్తించడం, యువ ఆటగాళ్లను అభివృద్ధి చేయడం, భవిష్యత్ భారత జట్లకు అవసరమైన టాలెంట్ పూల్‌ను మరింత బలోపేతం చేయడం వంటి అంశాలపై కమిటీ దృష్టి సారించనుంది. ఈ కమిటీలో చోటు కోసం పలువురు మాజీ క్రికెటర్లు దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం.




ప్రవీణ్ కుమార్‌తో పాటు మాజీ భారత క్రికెటర్లు రమేశ్ పవార్, సుదీప్ త్యాగి కూడా దరఖాస్తు చేసుకున్న జాబితాలో ఉన్నారట.ప్రవీణ్ కుమార్ భారత జట్టు తరఫున మూడు ఫార్మాట్లలోనూ ఆడారు. బంతిని ఇరువైపులా స్వింగ్ చేయగల సామర్థ్యంతో ఆయన ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ముఖ్యంగా ఇంగ్లాండ్ పరిస్థితుల్లో స్వింగ్ బౌలింగ్‌తో ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెట్టారు. భారత్ తరఫున ప్రవీణ్ కుమార్ 6 టెస్టులు ఆడి 27 వికెట్లు తీశారు. వన్డేల్లో 68 మ్యాచ్‌ల్లో 77 వికెట్లు పడగొట్టారు. టీ20ల్లో 10 మ్యాచ్‌లు ఆడి 8 వికెట్లు తీశారు. 2011 ఇంగ్లాండ్ పర్యటనలో భారత జట్టు తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచిన ప్రవీణ్ కుమార్.. లార్డ్స్ మైదానంలో ఐదు వికెట్ల ప్రదర్శన కూడా నమోదు చేశారు. 2008లో ఆస్ట్రేలియాలో జరిగిన కామన్వెల్త్ బ్యాంక్ సిరీస్‌లోనూ కీలక పాత్ర పోషించారు. నాలుగు మ్యాచ్‌ల్లో 10 వికెట్లు పడగొట్టి భారత జట్టు సిరీస్ విజయంలో తన వంతు సహకారం అందించారు.

# హైవోల్టేజ్ డ్రామా.. ఇలాంటి రనౌట్ ఎప్పుడూ చూడలేదు!




క్రికెట్‌లో అప్పుడప్పుడు ఊహించని ఘటనలు చోటు చేసుకుంటూ ఉంటాయి. ఇంగ్లండ్-శ్రీలంక మధ్య జరిగిన మూడో వన్డేలోనూ అలాంటి ఆసక్తికర ఘటనే జరిగింది. శ్రీలంక బ్యాటర్ పవన్ రత్నాయకే విషయంలో తొలుత ఔట్.. ఆ తర్వాత నాటౌట్.. చివరకు మళ్లీ ఔట్‌గా తేల్చారు అంపైర్లు. దాదాపు నాలుగు నిమిషాల పాటు సాగిన ఈ వ్యవహారం మ్యాచ్‌లో తీవ్ర ఉత్కంఠకు దారితీసింది. అసలు ఏమైందంటే?శ్రీలంక ఇన్నింగ్స్ 15వ ఓవర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. లియామ్ డాసన్ వేసిన బంతిని చరిత్ అసలంక షార్ట్ థర్డ్ దిశగా ఆడాడు. అక్కడ ఫీల్డింగ్ చేస్తున్న జోఫ్రా ఆర్చర్ వెంటనే బంతిని వికెట్ల వైపు విసిరాడు. ఆ సమయంలో రత్నాయకే క్రీజుకు చాలా దూరంలో ఉన్నాడు. బంతి వికెట్ల వద్దకు చేరుకునేలోపే బెయిల్స్ లైట్లు వెలిగాయి. స్క్వేర్ లెగ్ అంపైర్ తొలుత రత్నాయకేను ఔట్‌గా ప్రకటించాడు. అయితే నిర్ణయంపై అనుమానం రావడంతో టీవీ అంపైర్‌ను సంప్రదించారు. రీప్లేలో అసలు విషయం బయటపడింది.బంతి వికెట్లను తాకడానికి ముందే వికెట్ కీపర్ జోర్డాన్ కాక్స్ గ్లోవ్స్ తగిలి బెయిల్స్ కిందపడినట్లు కనిపించింది. దీంతో టీవీ అంపైర్ తొలుత ఔట్ నిర్ణయాన్ని మార్చి నాటౌట్‌గా ప్రకటించాడు. ది ఓవల్ మైదానంలోని పెద్ద స్క్రీన్‌పై కూడా 'నాటౌట్' అని ప్రత్యక్షమైంది. అయితే ఇంతటితో కథ ముగియలేదు. డ్రింక్స్ బ్రేక్‌లోనూ టీవీ అంపైర్ ఈ ఘటనను మరోసారి పరిశీలించాడు. మరో 90 సెకన్లపాటు రీప్లేలను పరిశీలించిన అనంతరం రత్నాయకేను ఔట్‌గా ప్రకటించాడు. అప్పటికే 18 పరుగులతో ఉన్న శ్రీలంక బ్యాటర్ కూడా ఏం జరుగుతుందో అర్థంకాక ఆశ్చర్యంగా కనిపించాడు.

**అసలు కారణం ఇదే..**

వికెట్లపై ఉన్న బెయిల్స్‌ను కాక్స్ గ్లోవ్స్ కింద పడేసినప్పటికీ.. ఆర్చర్ విసిరిన బంతి వికెట్‌ను పూర్తిగా నేల నుంచి పెకిలించింది. ఇదే చివరకు రనౌట్ నిర్ణయానికి కారణమైంది. ఎంసీసీ క్రికెట్ నిబంధనల ప్రకారం.. బంతి తగిలి స్టంప్ నేల నుంచి బయటకు వస్తే వికెట్ విరిగినట్లే. అలాగే ఫీల్డర్ స్టంప్‌ను నేల నుంచి బయటకు లాగినా లేదా కొట్టినా వికెట్ విరిగినట్లుగా పరిగణిస్తారు. ఈ నిబంధనల ఆధారంగానే రత్నాయకేను ఔట్‌గా తేల్చారు. అటు ఇంగ్లండ్ ప్లేయర్లు, ఇటు శ్రీలంక ఆటగాళ్లు మ్యాచ్ అనంతరం ఈ ఘటనపై స్పందించారు. ఇలాంటి రనౌట్‌ను ఇన్నేళ్ల క్రికెట్ కెరీర్‌లో ఎప్పుడూ చూడలేదంటూ వ్యాఖ్యానించారు.

# బిజినెస్

## 6 నెలల కిందకు పడిపోయిన సూచీలు




భారత స్టాక్ మార్కెట్ సూచీలు తమ నష్టాల ప్రయాణాన్ని ఈవారం రెండవరోజూ కొనసాగిస్తున్నాయి. సోమవారం నష్టాలకు మంగళవారం కూడా తోడుకావటంతో బెంచ్ మార్క్ సూచీలు సెన్సెక్స్, నిఫ్టీలు 6నెలల కనిష్ఠాలకు పడిపోయాయి. ఈ క్రమంలో ఉదయం 10.36 గంటల సమయంలో సెన్సెక్స్ 622 పాయింట్లు కోల్పోగా, నిఫ్టీ 190 పాయింట్లు నష్టపోయింది. ఇక నిఫ్టీ బ్యాంక్ సూచీ 605 పాయింట్లు, నిఫ్టీ మిడ్ క్యాప్ సూచీ 569 పాయింట్లు పతనం అయ్యాయి.ప్రపంచ చమురు మార్కెట్లో బెంచ్‌మార్క్ అయిన బ్రెంట్ క్రూడ్ ధర 1.74 శాతం పెరిగి బ్యారెల్‌కు 107.1 డాలర్లకు చేరుకుంది. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద చమురు దిగుమతి దారైన భారత్‌కు ఇది తీవ్ర ప్రతికూల పరిణామం. ఇది ద్రవ్యోల్బణాన్ని పెంచడమే కాకుండా.. దిగుమతి బిల్లును భారంగా మారుస్తుంది. దీనివల్ల దేశ ఆర్థిక వృద్ధి, కార్పొరేట్ కంపెనీల లాభాలు తగ్గిపోతాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.విదేశీ సంస్థాగత మ్యూచువల్ ఫండ్స్, ఇన్వెస్టర్లు భారత మార్కెట్ల నుంచి పెట్టుబడులను వెనక్కి తీసుకుంటున్నారు. సెప్టెంబర్ 28 నాటికి వరుసగా మూడో సెషన్‌లోనూ ఎఫ్ఐఐలు నికర అమ్మకందారులుగా నిలిచారు. ఒక్కరోజే రూ.5వేల 300 కోట్లకు పైగా విలువైన ఈక్విటీలను విక్రయించారు. ఈ విదేశీ నిధుల ఔట్ ఫ్లో స్టాక్ ధరలపై తీవ్ర ప్రభావం చూపుతోంది.ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియాకు చెందిన కోస్పి, జపాన్ నిక్కీ 225, హాంకాంగ్ హ్యాంగ్ సెంగ్ సూచీలు నష్టాల్లో ట్రేడయ్యాయి. సోమవారం అమెరికా మార్కెట్లు కూడా నష్టాలతో ముగిశాయి. వాల్ స్ట్రీట్ ఫ్యూచర్స్ పడిపోవడం, నాస్‌డాక్ ఫ్యూచర్స్ 0.5 శాతం వరకు క్షీణించడం వంటివి అమెరికా మార్కెట్లకు కూడా బలహీనమైన ప్రారంభాన్ని సూచిస్తున్నాయి.అంతర్జాతీయ పరిణామాలు, ముడి చమురు ధరల పెరుగుదల ప్రభావంతో రూపాయి మారకం విలువ మరింత బలహీనపడింది. రూపాయి విలువ ఏకంగా 16 పైసలు పడిపోయి, చారిత్రాత్మకంగా కీలకమైన 96 రూపాయల స్థాయిని దాటింది. ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 96.03 వద్ద ప్రారంభమై, ఆ తర్వాత 96.13కి పడిపోయింది. దీనివల్ల రానున్న కాలంలో దిగుమతి చేసుకునే వస్తువుల ధరలు పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.మార్కెట్ అస్థిరతను సూచించే 'ఇండియా విక్స్' ఏకంగా 6 శాతం పెరిగి 14.44 స్థాయికి చేరింది. ఇది మార్కెట్‌లో అనిశ్చితిని, రాబోయే రోజుల్లో హెచ్చుతగ్గులు ఎక్కువగా ఉండే అవకాశాన్ని సూచిస్తుంది. ఈ క్రమంలో ఇన్వెస్టర్లు మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.

# పడిపోతున్న పసిడి ధర..



దేశీయ మార్కెట్లో మంగళవారం, సెప్టెంబర్ 29న బంగారం, వెండి ధరల్లో భారీ కదలిక కనిపించింది. ప్రారంభ ట్రేడింగ్‌లో దేశీయ ఫ్యూచర్స్ మార్కెట్లో బంగారం ధరలు గణనీయంగా తగ్గాయి. అంతర్జాతీయంగా ఇరాన్-అమెరికా మధ్య హార్మూజ్ జలసంధిపై కొనసాగుతున్న ప్రతిష్టంభన, పెరుగుతున్న ఇంధన ధరలు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై అంచనాలు బులియన్ మార్కెట్‌పై ప్రభావం చూపుతున్నాయి. ఉదయం 9 గంటల సమయంలో MCX గోల్డ్ అక్టోబర్ 5 ఫ్యూచర్స్ 10 గ్రాములకు రూ.1,46,513 వద్ద ఉండగా, MCX సిల్వర్ డిసెంబర్ 4 కాంట్రాక్ట్ కిలోకు రూ.2,27,390 వద్ద ట్రేడైంది. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ఔన్స్‌కు సుమారు 4,125 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.రిటైల్ మార్కెట్‌లో 24 క్యారెట్ల బంగారాన్ని అత్యంత స్వచ్ఛమైన బంగారంగా పరిగణిస్తారు. నగల తయారీకి సాధారణంగా 22 క్యారెట్ల బంగారాన్ని ఎక్కువగా ఉపయోగిస్తారు. సెప్టెంబర్ 29న ప్రధాన నగరాల్లో నమోదైన రిటైల్ ధరలు ఇలా ఉన్నాయి.ముంబైలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,47,250గా.. 22 క్యారెట్ల గోల్డ్ రేట్ రూ.1,34,979గా ఉంది.. ఇక, కిలో వెండి ధర రూ.2,25,870కి చేరింది..న్యూఢిల్లీలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,46,990గా.. 22 క్యారెట్ల గోల్డ్ రేట్ రూ.1,34,741కి తగ్గింది.. కిలో వెండి ధర రూ.2,25,490 బెంగళూరులో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,47,360.. 22 క్యారెట్ల గోల్డ్ ధర రూ.1,35,080.. కిలో వెండి ధర రూ.2,26,050గా ఉంది..కోల్‌కతాలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,47,050.. 22 క్యారెట్ల పసిడి ధర రూ.1,36,015.. కిలో వెండి ధర రూ.2,27,850గా ఉంది..హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,47,520.. 22 క్యారెట్ల పసిడి ధర రూ.1,35,227.. కిలో వెండి ధర రూ.2,26,190గా ఉంది..చెన్నైలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,47,710.. 22 క్యారెట్ల పసిడి ధర రూ.1,35,401.. కిలో వెండి ధర రూ.2,26,490గా ఉంది..హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో కూడా భారీగా తగ్గింది.. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,370 తగ్గి.. రూ.1,48,800కి దిగివచ్చింది.. 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,250 తగ్గి.. రూ.1,36,400కి పరిమితమైంది.. వెండి ధర కూడా స్వల్పంగా తగ్గింది.. కిలో వెండి ధర రూ.100 తగ్గి రూ.2,44,900కి దిగివచ్చింది.. అయితే, ఆభరణాల కొనుగోలు సమయంలో పైన పేర్కొన్న ధరలకు అదనంగా మేకింగ్ ఛార్జీలు, పన్నులు, GST వంటివి జోడించే అవకాశం ఉంటుంది. అందువల్ల జువెల్లరీ షాపులో చెల్లించే తుది ధర నగరం, వ్యాపారి, ఆభరణం రకం ఆధారంగా మారవచ్చు..




# ఎస్26 సిరీస్ ధరలు ఏకంగా

గ్లోబల్ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శాంసంగ్ తన ప్రీమియం ఫ్లాగ్‌షిప్ గెలాక్సీ ఎస్26 సిరీస్ స్మార్ట్‌ఫోన్ల ధరలను ఏకంగా 17 శాతం వరకు పెంచేసింది. జనవరిలో రూ. 87,999 ప్రారంభ ధరతో విడుదలైన ఎస్26 (256జీబీ) బేసిక్ వేరియంట్ ధర తాజా పెంపుతో ఏకంగా రూ. 1,02,999కి చేరింది. దీంతో ఈ సిరీస్‌లోని అన్ని మోడళ్లు రూ. లక్ష మార్కును దాటేశాయి. అలాగే, 1టీబీ స్టోరేజ్ ఉన్న మోడల్ ఎస్26 అల్ట్రా ధర రూ. 2,14,999కి చేరింది. అంతర్జాతీయంగా మెమొరీ చిప్‌లు, మదర్‌బోర్డులు, కీలక ఎలక్ట్రానిక్ విడిభాగాల కొనుగోలు వ్యయం పెరగడమే ఈ ధరల సవరణకు ప్రధాన కారణమని పరిశ్రమ వర్గాలు వెల్లడించాయి. కేవలం శాంసంగ్ మాత్రమే కాకుండా, యాపిల్ కూడా తన కొత్త ఐఫోన్ 18 సిరీస్‌ను భారత్‌లో 20 నుండి 43 శాతం అధిక ధరలతో విడుదల చేసింది. అలాగే రూ. 3 లక్షల నుండి రూ. 4.5 లక్షల ధరల్లో యాపిల్ ఫోల్డబుల్ 'ఐఫోన్ డ్యూయో' పండుగ సీజన్‌కు ముందు ప్రీమియం స్మార్ట్‌ఫోన్ లైనప్‌లో అత్యంత ఖరీదైన డివైజ్‌గా ఎంట్రీ ఇచ్చింది.

# రెడ్ లేబుల్ వార్నింగ్‌పై ఫుడ్ ఇండస్ట్రీ అభ్యంతరం



ప్యాక్ చేసిన ఆహార పదార్థాలపై అధిక మొత్తంలో ఉండే చక్కెర, ఉప్పు, కొవ్వు పదార్థాలపై హెచ్చరిక లేబుళ్లు ముద్రించాలన్న ప్రతిపాదనపై ఆహార తయారీ పరిశ్రమ నుండి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. 3ఎస్, అవర్ హెల్త్ సొసైటీ దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టిన నేపథ్యంలో.. అనేక స్వదేశీ, అంతర్జాతీయ కంపెనీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆల్ ఇండియా ఫుడ్ ప్రాసెసర్స్ అసోసియేషన్ (ఏఐఎఫ్‌పీఏ) కోర్టును ఆశ్రయించింది. ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ప్రతిపాదించిన రెడ్ లేబుల్ (హెక్సాగాన్) హెచ్చరిక గుర్తు, దేశంలో మాంసాహార ఉత్పత్తులకు ఉపయోగించే గుర్తును పోలి ఉండి వినియోగదారులను తీవ్ర గందరగోళానికి గురిచేసే అవకాశం ఉందని సెప్టెంబర్ 24న దాఖలు చేసిన ఫైలింగ్‌లో పేర్కొంది. దీంతో రెడ్ లేబుల్ వాడకాన్ని, హెచ్చరిక చిహ్నాన్ని భారతీయ వాతావరణానికి అనుగుణంగా పునఃపరిశీలించాలని సుప్రీంకోర్టును కోరింది. అన్ని రకాల ఆహార పదార్థాలకు ఒకే విధమైన కఠిన నిబంధనలను విచక్షణారహితంగా వర్తింపజేయడం సరికాదని, రంగు, చిహ్నం విషయమై స్పష్టతనివ్వాలని పరిశ్రమ వర్గాలు కోరుతున్నాయి.




# ప్రేమంటే కంట్రోల్ చేయడం కాదు..

టాలీవుడ్ అందాల భామ రాశి ఖన్నా ప్రస్తుతం సూపర్ స్టార్ రజినీకాంత్ 'ధర్మన్' సినిమా షూటింగ్‌తో ఫుల్ బిజీగా ఉన్నారు. ఎంత బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే ఆమె.. తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో అభిమానులతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాన్స్ అడిగిన ప్రశ్నలకు ఆమె చాలా ఓపెన్‌గా, మనసులోని మాటలను పంచుకున్నారు. ఇక ఇందులో ఓ నెటిజన్ ఆమెను ఒక పర్సనల్ క్వశ్చన్ అడిగాడు. తనకు ఒంటరిగా అనిపించినప్పుడు ఆ ఒంటరితనాన్ని దూరం చేసుకోవడానికి ఏం చేస్తారని ప్రశ్నించగా.. రాశి ఖన్నా స్పందిస్తూ.. తనకు లోన్లీగా అనిపించినప్పుడు ఆ బాధను ఎక్కడా దాచుకోకుండా పూర్తిగా అనుభవిస్తానని చెప్పారు. దానివల్ల కళ్లలో నీళ్లు తిరిగితే తిరగనీస్తానని, ఆ భావాలను అణచివేయకుండా సహజంగా ప్రవహనిస్తానని.. వాటితో అనవసరంగా పోరాడనని ఆమె స్పష్టం చేశారు.ప్రముఖ ఆధ్యాత్మిక గురువు ఓషో బోధనల గురించి కూడా ఆమె మాట్లాడారు. ఓషో నుంచి తాను నేర్చుకున్న ఓ గొప్ప పాఠం తన జీవితంలో ఎప్పటికీ గుర్తుంటుందని చెప్పారు. ప్రేమ అంటే ఎవరినీ కంట్రోల్ చేయడం కాదని, వారికి పూర్తి స్వేచ్ఛనివ్వడమేనని అన్నారు. ప్రేమ ఎప్పుడైతే స్వచ్ఛమైన స్వేచ్ఛను ఇస్తుందో అదే అసలైన ప్రేమ అవుతుందని రాశి చెప్పుకొచ్చారు. కేవలం మనం ప్రేమిస్తున్నామన్న ఒక్క కారణంతో అవతలి వాళ్లను మనతోనే ఉండాలని ఎప్పుడూ బలవంతం చేయకూడదన్నారు. అవతలి వ్యక్తులను వారి సొంత నిర్ణయం తీసుకోనివ్వాలని, అదే సమయంలో మనం మన వ్యక్తిత్వాన్ని కోల్పోకుండా ఎదుగుతూనే ఉండాలని ఆమె తన మనసులోని భావాలను పంచుకున్నారు. ప్రస్తుతం ఈ పోస్ట్‌లు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.

# ఒక్క సినిమాకే సరిపోయింది..



టాలీవుడ్‌లో హీరోలకు ఇచ్చే ట్యాగ్‌లు వారి ఇమేజ్‌లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంటాయి. స్టార్ హీరో అల్లు అర్జున్ కూడా 'పుష్ప' సినిమాకు ముందు 'స్టైలిష్ స్టార్'గా గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే 'పుష్ప' సినిమా సమయంలో దర్శకుడు సుకుమార్ ఆయనకు 'ఐకాన్ స్టార్' అనే కొత్త ట్యాగ్‌ను పరిచయం చేశారు. ఈ పేరు అభిమానులకు బాగా నచ్చడం, పుష్ప ఊహించని హిట్ అవ్వడంతో.. అప్పటి నుంచి అల్లు అర్జున్ 'ఐకాన్ స్టార్'గానే కొనసాగుతున్నారు. ఇదే తరహాలో మరో హీరో నాని విషయంలోనూ ఇటీవల ఓ కొత్త ట్యాగ్ తెరపైకి వచ్చింది. నేచురల్ స్టార్‌గా ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నాని.. శ్రీకాంత్ ఓదెల తెరకెక్కించిన 'ది ప్యారడైజ్' సినిమాలో 'షేర్ నాని' అనే ట్యాగ్‌తో కనిపించారు. ముందుగా నేచురల్ స్టార్ నానిగా.. ఆపై షేర్ నానిగా స్క్రీన్‌పై పడింది. అయితే ప్యారడైజ్ మూవీకి ఆశించిన స్థాయిలో స్పందన రాకపోవడం, సినిమాకు డివైడ్ టాక్ రావడంతో పాటు సోషల్ మీడియాలో ట్రోలింగ్ కూడా చోటుచేసుకోవడంతో.. నాని తన పాత ట్యాగ్‌నే కొనసాగించాలని నిర్ణయించుకున్నారట. ఇకపై తన పేరుకు ముందు 'నేచురల్ స్టార్' అనే ట్యాగ్‌నే ఉపయోగించాలని భావిస్తున్నట్లు సమాచారం.అయితే 'షేర్ నాని' ట్యాగ్‌ను పూర్తిగా పక్కన పెట్టారా? లేదా భవిష్యత్‌లో ఏదైనా సందర్భంలో మళ్లీ ఉపయోగిస్తారా? అనే దానిపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుతానికి మాత్రం నాని అభిమానులు మాత్రం ఆయనను 'నేచురల్ స్టార్ నాని'గానే చూడటానికి ఇష్టపడుతున్నారు. ఇక ప్యారడైజ్ సినిమా నాలుగు రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రూ.155 కోట్ల గ్రాస్ కలెక్ట్ చేసింది. నెగిటివ్ టాక్ ఉన్నా.. ఈ కలెక్షన్స్ రావడం అద్భుతమే అని చెప్పాలి. నాని జడల్ పాత్రలో నటించగా.. మోహన్ బాబు మాలిక్, కయాడు లోహర్ సుబ్బు పాత్రల్లో నటించారు.



# అభిమానులకు మరో అదిరిపోయే అప్డేట్..

మెగా అభిమానులకు మరో అదిరిపోయే అప్డేట్ వచ్చేసింది. మెగాస్టార్ చిరంజీవి జీవితంపై డాక్యుమెంటరీ అనుకుంటే.. నెట్‌ఫ్లిక్స్‌లో ఏకంగా ఆయన మాటల్లోనే ఒక పాడ్‌కాస్ట్ రాబోతున్నట్లు ఫిలిమ్ వర్గాల నుంచి వార్తలు వినిపిస్తున్నాయి. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ కోసం ఆయన ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని చేయనున్నారనే పుకార్లు ప్రస్తుతం నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. దశాబ్దాల సినీ ప్రయాణం, విజయాలు, సవాళ్లు, మరిచిపోలేని అనుభవాలను మెగాస్టార్ స్వయంగా పంచుకోబోతున్న ఈ షోను సుస్మిత కొణిదెల నిర్మించనున్నట్లు సమాచారం. ఈ కార్యక్రమం ద్వారా చిరంజీవి తన వ్యక్తిగత, సినీ జీవితంలోని అనుభవాలను ప్రేక్షకులతో నేరుగా పంచుకునే అవకాశం ఉందని తెలుస్తుండగా.. ఇన్నేళ్ల సినీ ప్రయాణంలో తనకు ఎదురైన అనుభవాలు, పరిశ్రమలో మారిన పరిస్థితులు, తన ఆలోచనా విధానం వంటి విషయాలను కూడా ఇందులో పంచుకోనున్నారట. అంతేకాకుండా.. ఈ మధ్య కాలంలో #ChiruLeaks అనేది బాగా పాపులర్ అయిన సంగతి తెలిసిందే. ఈ షోకు అదే పేరు పెట్టి.. సెలబ్రిటీ ఫ్యామిలీస్‌తో కూడా చిరు సంభాషిస్తూ, ఆ సెలెబ్రిటీల గురించి లీకులు వదిలే అవకాశాలున్నట్లు తెలుస్తుండగా.. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తుండట నెట్‌ఫ్లిక్స్.

# 'జైలర్-2' థర్డ్ సింగిల్ అప్డేట్ ఇచ్చిన మేకర్స్..




టాలీవుడ్, కోలీవుడ్ అనే తేడా లేకుండా బాక్సాఫీస్‌ను షేక్ చేసిన సూపర్‌స్టార్ రజినీకాంత్, సెన్సేషనల్ డైరెక్టర్ నెల్సన్ దిలీప్ కుమార్ కాంబినేషన్ మరోసారి ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతోంది. వీరిద్దరి క్రేజీ కాంబోలో తెరకెక్కుతున్న బ్లాక్‌బస్టర్ మూవీ 'జైలర్'కు సీక్వెల్‌గా 'జైలర్ 2' వస్తున్న విషయం తెలిసిందే. మొదటి భాగం సంచలన విజయం సాధించడంతో ఈ సీక్వెల్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో రజినీకాంత్‌తో పాటు సూరజ్, ఎస్, సూర్య, విద్యాబాలన్ కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు.సినిమాపై హైప్ మరింత పెంచేలా రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ తనదైన శైలిలో హై-వోల్టేజ్ మాస్ మ్యూజిక్ అందిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన రెండు సాంగ్స్ ఆడియెన్స్‌ను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ఇక ఇప్పుడు సినిమా నుంచి మరో క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. మేకర్స్ తాజాగా మూడో పాట రాబోతున్నట్లు అఫీషియల్‌గా అనౌన్స్ చేశారు. "సంగీతపు సునామీ మిమ్మల్ని ముంచెత్తబోతోంది" అంటూ అనిరుధ్ మ్యూజిక్ మానియా గురించి చెప్పారు. జైలర్ 2 సినిమాలోని 'రేవ్' సాంగ్‌తో పాటు పూర్తి మ్యూజికల్ ఆల్బమ్‌ను సెప్టెంబర్ 30న విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ అనౌన్స్‌మెంట్‌తో రజినీ ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు.

# ట్విస్ట్స్, టర్న్లు ఎన్నో ఉన్నాయి..




విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న మూవీ 'ఆదర్శ కుటుంబం'. శ్రీనిధి శెట్టి, నివేదా పేతురాజ్, డింపుల్ హయాతీ హీరోయిన్స్‌గా, నారా రోహిత్, సత్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ మూవీకి ఎస్.థమన్ సంగీతం అందిస్తున్నాడు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తున్నాడు. ఈ ఫ్యామిలీ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ అక్టోబర్ 9న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వస్తుండగా.. ప్రమోషన్స్‌లో జోరు పెంచిన మేకర్స్ తాజాగా.. మొదటి సింగిల్ 'నారాయనమ్మ'ను విడుదల చేశారు. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో వెకంటేష్ మాట్లాడుతూ.. సినిమాపై భారీ హైప్ ఇచ్చేశారు.'నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి లాంటి క్లాసిక్ లవ్ స్టోరీస్ తర్వాత.. 20 ఏళ్లకి మళ్లీ నేను, త్రివిక్రమ్ ఒక్కటయ్యాం.. ఈసారి మీరు పూర్తిగా ఇష్టపడేలా యాక్షన్, ఎంటర్‌టైన్‌మెంట్, ఎమోషన్స్, సెంటిమెంట్ కలగలిసిన పర్ఫెక్ట్ కాంబినేషన్‌తో వస్తున్నాం. మీరు ఊహించని ట్విస్ట్స్, టర్న్లు ఎన్నో మా 'ఆదర్శ కుటుంబం'లో ఉంటాయి' అంటూ చెప్పుకొచ్చాడు. ప్రజెంట్ విక్టరీ వెంకటేష్ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతుండగా.. సినిమాపై ఎక్స్‌పెక్టేషన్స్ పెరుగుతున్నాయి.

# వాళ్ల ఎంజాయ్‌మెంట్ కోసం నేనెందుకు పెళ్లి చేసుకోవాలి..




టాలీవుడ్ స్టార్ హీరోయిన్ అంజలి ప్రస్తుతం తెలుగు, తమిళ భాషల్లో వరుస సినిమాలతో ఫుల్ బిజీగా గడుపుతున్నారు. సినిమాల సంగతి ఎలా ఉన్నా, తాజాగా ఆమె తన పెళ్లి గురించి చేసిన కామెంట్స్ మాత్రం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఓ ఇంటర్వ్యూలో తన మ్యారేజ్ ప్లాన్స్ గురించి అంజలి ఓపెన్‌గా మాట్లాడారు. పెళ్లి చేసుకోవాలని తనపై కుటుంబం నుంచి ఎలాంటి ఒత్తిడి లేదని, ఇప్పట్లో తాను ఆ దిశగా అసలు ఆలోచించడం లేదని స్పష్టం చేశారు. ఎవరికోసమో తాను పెళ్లి పీటల ఎక్కనని, తనకు నచ్చినప్పుడు, సరైన వ్యక్తి దొరికినప్పుడే పెళ్లి చేసుకుంటానని చెప్పారు. పెళ్లి విషయంలో ఎవరి మాట వినాల్సిన అవసరం లేదని, తొందరపడాల్సిన అవసరం ఏముందని ఆమె ప్రశ్నించారు.అలాగే తన పెళ్లిపై సరదాగా మాట్లాడుతూ.. పెళ్లి అయ్యాక భర్తతో సహా అందరూ ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోతారని, చివరికి తాను మాత్రమే మిగులుతానని అన్నారు. తనకు, తన స్నేహితులకు చక్కగా ముస్తాబవ్వడం, ఫొటోషూట్లు చేయడం, సందడి చేయడం అంటే చాలా ఇష్టమని చెప్పారు. అలా సరదాగా ఎంజాయ్ చేయడానికి తానేందుకు పెళ్లి చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా తన స్నేహితులకు ఓ ఫన్నీ ఆఫర్ ఇచ్చినట్లు అంజలి వెల్లడించారు. 'మీరే పెళ్లి చేసుకోండి.. ఆ వేడుకలకు నేను చక్కగా రెడీ అయ్యి వచ్చి ఫొటోషూట్లలో పాల్గొంటాను'అని తన ఫ్రెండ్స్‌తో సరదాగా చెప్పినట్లు తెలిపారు. మొత్తానికి పెళ్లిపై తనకంటూ క్లారిటీ ఉందని, తనకు నచ్చిన రీతిలోనే జీవిస్తానని అంజలి తేల్చిచెప్పారు.

# నాని సరసన నాజూకు బ్యూటీ..



'సాహో', 'OG' చిత్రాల దర్శకుడు సుజీత్ మరియు నేచురల్ స్టార్ నాని కాంబినేషన్‌లో రాబోతున్న మోస్ట్ అవైటెడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం బ్లడీరోమియో. నిహారిక ఎంటెర్టైమెంట్స్ తో నాని సొంత నిర్మాణ సంస్థ యునానిమస్ ప్రొడక్షన్స్ పై నాని, వెంకట్ బోయినపల్లి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. స్టైలిష్ విజువల్స్, నాని సరికొత్త మేకోవర్‌తో రూపొందుతున్న ఈ సినిమా సంబంధించిన క్రేజీ అప్‌డేట్ వినిపిస్తోంది. ఈ చిత్రంలో నాని సరసన హీరోయిన్‌గా గ్లామరస్ బ్యూటీ మీనాక్షి చౌదరి నటించనుందట. అలాగే మలయాళ వర్సటైల్ స్టార్ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ఒక కీలకమైన పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. పృథ్వీరాజ్ ఈ ప్రాజెక్ట్‌లో భాగం కావడం సినిమాపై అంచనాలను మరింత పెంచేసింది. వినిపిస్తున్న సమాచారం ప్రకారం, 'బ్లడీ రోమియో' చిత్ర షూటింగ్ ఈ ఏడాది అక్టోబర్ నెలలో గ్రాండ్‌గా ప్రారంభం కానుంది. మొదటి షెడ్యూల్‌ను హైదరాబాద్‌లో ప్రారంభించి, ఆ తర్వాత లండన్ వేదికగా ఒక భారీ షెడ్యూల్‌ను ప్లాన్ చేస్తున్నారు. లండన్‌లో తీయబోయే సన్నివేశాలు ఈ సినిమాకే ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని సమాచారం. నాని ఒక సరికొత్త మేకోవర్‌తో ఈ సినిమాలో అలరించబోతున్నారు. డిఫరెంట్ యాక్షన్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎలిమెంట్స్‌తో రానున్న ఈ చిత్రం పాన్-ఇండియా స్థాయిలో విడుదల కానుంది. అలాగే ఈ సినిమా కోసం ముగ్గురు సంగీత దర్శకులు పని చేయబోతున్నట్లు కూడా టాక్ వినిపిస్తోంది.

Edited, Printed, Published & Owned by KOMARAJU SRINIVASULU and Printed at Ramu Graphics, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229